S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుక.. మన పత్రిక తెలుగు దినపత్రిక



విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 19 | సంచిక: 120 | ఎడిటర్ : విక్రం కుమార్ | శుక్రవారం 27 ఫిబ్రవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |




## నదుల అనుసంధానమే శ్రీరామరక్ష

- పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుతో మేలు
- కాళేశ్వరం కట్టినా మేం అభ్యంతరం చెప్పలేదు
- గోదావరిలో వృధా జలాలు వినియోగంలోకి తెస్తాం
- శాసనసభలో సీఎం చంద్రబాబు

5

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమేనా?



- పట్టాలు, పన్ను రశీదులు ఉన్నా దౌర్జన్యమా?
- బాధితులకు అండగా సుప్రీంకోర్టు దాకైనా వెళ్తాం
- కూల్చిన చోటే ఇళ్లు కట్టించి గృహప్రవేశం చేయిస్తాం
- ఖమ్మం బాధితుల పక్షాన కేటీఆర్ గర్జన

వివరాలు 2లో..



## ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే

- ఆధారాలు చూపిన మంత్రి పొంగులేటి
- కేటీఆర్‌కు మంత్రుల స్ట్రాంగ్ కౌంటర్

3

అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం, ఇల్లు కచ్చితంగా ఇస్తామని భరోసా

## భారత్-ఇజ్రాయెల్ సరికొత్త మైత్రి



### త్వరలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

- యూపీఐ విషయంలో ఇరు దేశాల మధ్య ఎంవోయూ
- ఏఐ, వ్యవసాయ రంగాల్లో 27 కీలక ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని ప్రకటన
- భారత్‌కు రుణపడి ఉన్నానన్న నెతన్యాహు

4

ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయుక్త ప్రకటనలో వెల్లడించారు.



## ఎన్‌సీఈఆర్‌టీ వివాదంపై మోదీ అసంతృప్తి

4



భారతీయ విద్యాభవన్ తరహాలో

# సర్కారు స్కూళ్లు

### ప్రైవేట్ స్కూళ్ల ఫీజులకు కళ్లెం వేసేలా చర్యలు

- మౌలిక వసతులతో పాటు..బ్రేక్‌ఫాస్ట్
- విజయ డెయిరీ ద్వారా పాల సరఫరా
- రవాణా కోసం ఎలక్ట్రిక్ బస్సుల వినియోగం
- సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రభుత్వ స్కూల్స్‌లో మౌలిక సదుపాయాల కల్పనపైన దృష్టి సారించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలో రాజీ పడొద్దని స్పష్టం చేశారు. భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉండాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌పైన సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు మిగతా 3 లో



- ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని కాదు..
- తెలంగాణ ప్రజల మనస్తత్వాన్ని గుర్తించాలి

## ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే

గ్రూప్-1, 2 అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

03




## జర్నలిస్టులకు ఊరట

అక్రిడిటేషన్ కార్డుల గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు

జీఓ 252, 103లపై హైకోర్టులో విచారణ.. ప్రభుత్వ వివరణకు ఆదేశం

3




## భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

3



## భారతీయ రైల్వేల్లో డిజిటల్ విప్లవం

- 'రైల్ టెక్' పోర్టల్, 'ఈ-ఆర్సీటీ' వ్యవస్థ ప్రారంభం
- 52 వారాల్లో 52 సంస్కరణలు
- స్టార్టప్‌లు, ఆవిష్కర్తలకు పెద్దపీట

4

## కుమ్మెర ఘటనపై ఎన్‌హెచ్ఆర్‌సీ సీరియస్

- పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం
- నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు
- బాధితులకు న్యాయం చేయాలని స్పష్టీకరణ

3





# వీహెచ్, జెట్టిలకు రాజ్యసభ ఇవ్వాలి

## ఆ ఇద్దరి సభ్యతంవాలపై ఆలోచన చేయాలని

## ఖర్గేను కలిసి కోరిన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాల్లో కాంగ్రెస్ సీనియర్ నేత వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి ఇవ్వాలని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి గురువారం ఢిల్లీలో కలిశారు. ఖర్గేతో ఆయన పలు కీలక అంశాలపై చర్చించారు. తెలంగాణలో ఖాళీ కానున్న రెండు రాజ్యసభ స్థానాలపై సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో కూడా ఈ విషయంపై మాట్లాడానని, వి. హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకి రాజ్యసభ ఇవ్వాలని కోరానని అన్నారు. ఇదే విషయంపై రాహుల్ గాంధీని, మల్లికార్జున్ ఖర్గేని కలవడానికి ఢిల్లీకి వచ్చానని తెలిపారు. రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉన్నారని చెప్పుకొచ్చారు. వి. హనుమంతరావు. జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశాలపై ఆలోచన చేయాలని కోరానని తెలిపారు. జెట్టి కుసుమ కుమార్.. యూత్ కాంగ్రెస్ లీడర్‌గా, స్టూడెంట్ లీడర్‌గా.. కమ్మ సామాజిక వర్గం నుంచి ఉన్నారని ప్రస్తావించారు. జెట్టి కుసుమ కుమార్ ఫ్యామిలీ ఫ్రీడమ్ ఫైటెర్స్ అని, వాళ్ల కుటుంబం నుంచి అంతా కాంగ్రెస్‌లోనే ఉన్నారని గుర్తుచేశారు. హనుమంతరావు తెలంగాణలో అనేక మంది ముఖ్యమంత్రులతో పని చేశారని వెల్లడించారు. మూడుసార్లు రాజ్యసభ ఎంపీగా పని చేశారని చెప్పుకొచ్చారు. ఆయనకు రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ అవకాశాలు ఇచ్చారని తెలిపారు. వి.హనుమంతరావు చురుకైన వ్యక్తి అని, ఆయనకు మరోసారి రాజ్యసభకు అవకాశం ఇవ్వాలని ఖర్గేను కోరానని అన్నారు. కమిటీలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని తెలిపారు. రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# చిన్నారి మృతి కారకులను శిక్షించాలి

## లేదంటే హైదరాబాద్‌ను దిగ్బంధిస్తాం

## మాజీమంత్రి తలసాని హెచ్చరిక



**నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 26 :** కుమ్మెర మల్లన్న జాతరలో రెండు నెలల చిన్నారి మృతికి కారణమైన వారిని శిక్షించాలని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. గురువారం నాగర్ కర్నూల్ కేంద్రంలో కుమ్మెర బాధితుల పక్షాన చేపట్టిన దీక్ష శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజులలో దోషులపై చర్యలు తీసుకోకుంటే హైదరాబాద్‌ను దిగ్బంధం చేస్తామని , అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. అభం శుభం తెలియని చిన్నారి మృతికి కారకులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. నిందితులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 సంవత్సరాలు అవుతున్న బడుగు బలహీన వర్గాల ప్రజల పట్ల కొనసాగుతున్న వివక్ష, దాడులు, దౌర్జన్యాలు, ఆలయాల్లో ప్రవేశంపై ఆంక్షలు కొనసాగడం బాధాకరమని అన్నారు.దేవుడిని దర్శించుకునే అర్హత బలహీన వర్గాలకు లేదా? అని ప్రశ్నించారు. కుమ్మెర దోషులను రక్షించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

# గిరిజన కళపై ఐదు రోజుల శిక్షణ




**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ సూచనల మేరకు గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ మొత్తం 30 మందికి గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైదరాబాదులో 26 వ తేదీ నుండి 2 మార్చ్ వరకు నిర్వహిస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు ఐటిడిఏ ఉట్నూర్, ఏటునాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా నుండి సంబంధిత ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ చేయబడి రావడం జరిగింది. వీరందరికీ భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా పదిమంది గిరిజన ఆర్టిజన్స్ కు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఆనరోరియం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టిఆర్ఐ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల , టి ఆర్ ఐ సంగ్రహాలయ సంరక్షకులు డాక్టర్ డి సత్యనారాయణ , శిక్షణనిస్తున్న డైరెక్టర్ డా. సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ , టిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యమంటే ఇండ్లు కూల్చడమేనా?

- పట్టాలు, పన్ను రశీదులు ఉన్నా దౌర్జన్యమా?
- బాధితులకు అండగా సుప్రీంకోర్టుకైనా..
- కూల్చిన చోటే గృహప్రవేశం చేయిస్తాం
- ఖమ్మం బాధితుల పక్షాన కేటీఆర్ గర్జన



**ఖమ్మం, ఫిబ్రవరి 26:** తెలంగాణలో దుర్మార్గమైన ప్రభుత్వం రాజ్యమేలుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం వెలుగుమట్ల భూదాన్ భూముల్లో తొలగించిన ఆక్రమణలను కేటీఆర్ పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. వచ్చే నెల16వ తేదీ నుంచి అసెంబ్లీ ప్రారంభ మవుతుందని ఖమ్మం ప్రజల సమస్యను అసెంబ్లీలో ప్రస్తావిస్తామని అన్నారు. మీ అందరికీ న్యాయం జరిగేవరకూ మీ పక్షాన ప్రభుత్వంపై పోరాడతామని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే మీ అందరికీ ఇదే స్థలంలో ఇళ్లస్థలాలు ఇచ్చి ఇళ్లు కట్టిస్తామని కేటీఆర్ భరోసా కల్పించారు. అందరూ ధైర్యంగా ఉండాలని అంటూ బాధితులకు కేటీఆర్ మాటిచ్చారు. హైదరాబాద్ నుంచి ఖమ్మం వరకు ఎక్కడ చూసినా కూల్చివేతలేనని ఆరోపించారు. ఖమ్మంలో కూల్చివేసిన కాలనీ చూశానని.. ముగ్గురు మంత్రులకు 60 ఎకరాల మీద కన్నుబడిందని ఆక్షేపించారు. ముగ్గురు మంత్రులు కలిసికట్టుగా ఈ దుర్మార్గం చేశారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎవరికీ తాము అన్యాయం చేయలేదని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరూ ధైర్యంగా ఉండాలని.. మీ అందరికీ అదే ప్రాంతంలో అక్కడే ఇళ్ల స్థలాలు ఇల్లు ఇస్తామని మాటిచ్చారు. ఇక్కడి వారందరికీ అండగా నిలబడాలని తాను వచ్చానని చెప్పుకొచ్చారు. ఇళ్ల కూల్చివేతపై కోర్టుకి కూడా వెళ్దామని.. మీకెవరికీ ఒక రూపాయి ఖర్చు లేకుండా మీ తరపున తమ లీగల్ టీం పోరాడుతుందని మాజీమంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. పేదలు ఎంతో కష్టపడి కట్టుకున్నఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం బుల్డోజర్లతో కూల్చివేస్తున్న సంగతి తెలిసిందే. రేవంత్ సర్కార్ కనికరం లేకుండా ఖమ్మం అర్బన్ వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల ఇళ్లను నేలమట్టం చేస్తోంది. ఈ క్రమంలో వారికి అండగా నిలిచేందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులను కలిశారు. ఇళ్లు కోల్పోయిన వెలుగు మట్ల బాధితులను కేటీఆర్, పార్టీ నేతలతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. మిమ్మల్ని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పిలుస్తరు. మీకు అది చేస్తం.. ఇది చేస్తం.. అది చేస్తమని.. మీ 900 కుటుంబాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తాడు. మీరు ఐక్యంగా ఉంటేనే విజయం సాధిస్తరు.. లేదంటే వీళ్ల ఏం చేస్తరు. ఏ 100 మందితో వేలి ముద్రలు తీసుకొని మీకు ఆన్నేన్నో ఇస్తరు.. కేసీఆర్ 2000 డబుల్ బెడ్ రూం ఇండ్లు కట్టించారు. వాటిలో కొన్ని మిగులున్నయట. ఆ ఇండ్లలో కొంతమందికిస్తమని చెప్పి వారిని లాక్కెళతారని కేటీఆర్ హెచ్చరించారు. ఓపీడీఆర్ వాళ్లు గతంలో ఎప్పుడో చేసిన పని. పాపం వాళ్లేం తప్పు చేయలేదు.. మీకు పట్టాలిప్పించారు. వాళ్లు తప్పు చేసిందేమి లేదు.. ఇప్పుడు వాళ్లను పట్టుకుని ప్రభుత్వం నానా మాటలు అంటోంది. ల్యాండ్ మాఫియానట.. ఎవడమ్మా ల్యాండ్ మాఫియా.. ఎవడైతే ఇవాళ మీ చుట్టూ వందల ఎకరాలు కొన్నాడో.. ఎవడైతే పేదవాడి ఇల్లు కట్టుకున్నడో వాడు మాఫియానా..? మీకు జరిగిన కష్టం.. మీ ఏడుపులు రాష్ట్రం మొత్తం చూసింది. మీ పిల్లలు, మీరు పడుతున్న అవస్థలు చూసే కేసీఆర్ సార్ మమ్మల్ని పంపించారు. దయచేసి ధైర్యంగా ఉండండి.. మీకు అన్ని రకాలుగా అండగా అజయ్ అన్న, మా ఎంపీ గాయత్రి రవిచంద్ర ఉంటారన్నారు. ఏ తప్పు జరుగకపోతే ఆర్డీవోను ఎందుకు వెంటనే బదిలీ చేశారు. సమాధానం చెప్పాలే ప్రభుత్వం. మంత్రులు తప్పు చేయకపోతే.. నిజంగా ధైర్యముంటే వాల్లెందుకు రావడం లేదు.. ఇక్కడికి.. వాళ్లొచ్చి మాట్లాడాలి కదా.. అందుకే మీరు ధైర్యంగా ఉండండి. మీ వెంబడి కేసీఆర్ అన్న ఉన్నడు.. కేటీఆర్ అన్న ఉన్నడు. మేమంతా ఉన్నం. ఎట్టి పరిస్థితుల్లో మీకు న్యాయం జరిగేదాకా మేము అండగా ఉంటామని హామీనిచ్చారు. మీకు అన్ని కాగితాలున్నాయి.. కోర్టుకు పోదాం.. కోర్టుకు కూడా మీరు రూపాయి ఖర్చు పెట్టుకునే పని లేదు. పార్టీ తరపున మేం కొట్లాడుతాం.. మీకు మేం అండగా ఉంటాం. మళ్లీ వస్తాం మిమ్మల్ని కాపాడుకుంటాం. న్యాయపరంగా పట్టాలిప్పించే ప్రయత్నం చేస్తాం. దయచేసి ఐకమత్యాన్ని కోల్పోకండి.. సంఘటితంగా, ఒక్కటిగా ఉండండిని సూచించారు.





# భూభారతి పేరుతో కాంగ్రెస్ మార్క్ అవినీతి

- రెవెన్యూ వ్యవస్థను భ్రష్టుపట్టించిన కాంగ్రెస్ సర్కార్
- మాజీ మంత్రి హరీష్ రావు విమర్శ
- సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయం సందర్శన



**సిద్దిపేట, ఫిబ్రవరి 26:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని, ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని చెప్పిన నాయకులు.. ఇప్పుడు 'భూభారతి' పేరుతో ప్రజలను గోసపెడుతున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు విమర్శించారు. గురువారం సిద్దిపేట అర్బన్ ఎమ్మార్వో కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన ఆయన, అక్కడ పడిగాపులు కాస్తున్న ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో వారం రోజుల్లోనే ఇంటికి వచ్చే పాస్ పుస్తకాలు, ఇప్పుడు ఆరు నెలలైనా రావడం లేదని హరీష్ రావు మండిపడ్డారు. రెవెన్యూ సదస్సుల పేరిట రైతులు పెట్టుకున్న 8.68 లక్షల దరఖాస్తులను ప్రభుత్వం పక్కన పడేసిందని, సాదా బైనామా భూముల విషయంలో 'అమ్మిన వ్యక్తి అఫిడవిట్ ఇవ్వాలి' అనే కొత్త నిబంధన తెచ్చి లక్షలాది మంది రైతుల నోట్లో మట్టికొట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిషేధిత భూముల జాబితాను ఆన్‌లైన్‌లో పెట్టకుండా కోటి ఎకరాలకు పెంచేసి కాంగ్రెస్ నేతలు పక్కాగా రియల్ ఎస్టేట్ దందా చేస్తున్నారని ఆరోపించారు. హైకోర్టు మొట్టికాయలు వేస్తున్నా ప్రభుత్వ తీరు మారడం లేదని ధ్వజమెత్తారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎల్‌ఆర్ఎస్‌ను ఉచితంగా చేస్తామని చెప్పిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తోందని ఆయన విమర్శించారు. రెవెన్యూ శాఖలో అవినీతి పరాకాష్టకు చేరిందని, సాక్షాత్తు మంత్రి కుమారుడే భూకబ్జాలకు పాల్పడుతుంటే ప్రశ్నించిన సీఐని బదిలీ చేయడం ప్రభుత్వ దిగజారుడుతనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. చనిపోయిన వీఆర్‌ఓల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, 4 వేల మంది వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రెవెన్యూ సమస్యలను పరిష్కరించకుంటే రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజల పక్షాన గట్టిగా పోరాడుతామని హరీష్ రావు హెచ్చరించారు.

# మార్చి 2 నుంచి రాష్ట్రవ్యాప్తంగా '100 రోజుల ప్రణాళిక'

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** సీఎం ఆదేశాల మేరకు రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం '100 రోజుల కార్యాచరణ ప్రణాళిక'ను సిద్ధం చేసింది. సచివాలయంలో గురువారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో సీఎస్ రామకృష్ణారావు అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో కలిసి ఈ ప్రణాళికపై చర్చించారు. మార్చి 2 నుంచి జూన్ 9 వరకు (తెలంగాణ ఆవిర్భావ వేడుకల వరకు) ఈ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు కొనసాగనున్నాయి. ఈ వంద రోజుల ప్రణాళికపై ఈ నెల 28న ముఖ్యమంత్రి స్వయంగా కార్యదర్శులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం మార్చి 1న (ఆదివారం) రాష్ట్రంలోని జిల్లా కలెక్టర్లందరితో సీఎం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహిస్తారు. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై తక్షణమే నివేదికలు రూపొందించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖ తమ పరిధిలోని అభివృద్ధి పనులు, ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న భవనాల వివరాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి, మంత్రులు ఈ 100 రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్యం, వ్యవసాయం, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్ వంటి అన్ని కీలక శాఖలు ఈ 100 రోజుల కార్యాచరణలో భాగం పంచుకోనున్నాయి. ముఖ్యంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు పారిశుధ్యం, గ్రామీణాభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సీఎస్ స్పష్టం చేశారు. అలాగే పాలనలో పారదర్శకత కోసం సచివాలయంతో పాటు అన్ని హెచ్ఓడీ కార్యాలయాల్లో 'ఈ-ఆఫీస్' విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేస్తూ, ఫిర్యాదుల పరిష్కారానికి ఈ 100 రోజుల కార్యక్రమం ఒక వేదికగా నిలవనుంది.



# భారతీయ విద్యాభవన్ తరహాలో స్కూళ్లు

మొదటి పేజీ తరువాయి

కే కేశవరావు, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి , విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, కళాశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేన, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కుమార్, అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని మార్గనిర్దేశం చేశారు. బ్రేక్ ఫాస్ట్ స్కీమ్‌లో తప్పనిసరిగా పాలు అందజేయాలని నిర్దేశిరచారు. ఇందుకోసం విజయా డైరీ నుంచి పాలు సేకరించాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత కోసం ఏఐ టెక్నాలజీని వినియోగించాలని దిశానిర్దేశర చేశారు. కోర్ అర్బన్ రీజియన్ మినహా మిగిలిన నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్ కింద ఒక్కొక మండలంలో



ఆరుట్ల స్కూల్ తరహాలో ట్రాన్స్‌పోర్ట్‌తో సహా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ట్రాన్స్‌పోర్ట్ కోసం ఎలక్ట్రికల్ బస్సుల ఏర్పాటు పైన అధ్యాయనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ప్రైవేట్ స్కూల్స్‌లో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దుతో పాటు రికవరీ చేసేలా నిబంధన విధించాలని హుకుం జారీ చేశారు. ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు సంబంధించి రికమండేషన్స్‌ని ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ప్రభుత్వ పథకాల అమలు బాధ్యత మీదే

- ఆకలినైనా సహిస్తారు కానీ ఆధిపత్యాన్ని కాదు..
- తెలంగాణ ప్రజల మనస్తత్వాన్ని గుర్తుంచుకోవాలి
- గ్రూప్-1, 2 అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కానీ, ఆధిపత్యాన్ని సహించబోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి గ్రూప్ 1 పరీక్షలను నిర్వహించి.. నియామక పత్రాలు అందించామన్నారు. గ్రూప్ 1, 2 ఉద్యోగుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాలను అమ్ముకున్నామని కోర్టుల్లో లీగల్ లిటిగేషన్ పెట్టారని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క తప్పు కూడా చేయలేదని అన్నారు. బాగా చదువుకున్న వాళ్లను టీజీపీఎస్సీలో నియమించాం. అన్ని జాగ్రత్తలతో పరీక్షలు నిర్వహించి ఫలితాలు



ప్రకటించాం. మీరంతా శిక్షణ పూర్తి చేసుకొని ఉద్యోగాల్లో చేరుతున్నారు. ప్రభుత్వం మిమ్మల్నే రాష్ట్ర ప్రతినిధులుగా భావిస్తోంది. మీ ద్వారానే ప్రభుత్వ పథకాలు అమలవుతాయి. మేం ఎన్ని పాలసీలు చేసినా.. దాని అమల్లో మీరే చాలా ముఖ్యం. బాధ్యతాయుతమైన పదవుల్లో చేరుతున్నారు. ఉద్యోగవిరమణ రోజు వరకు ఇదే స్ఫూర్తితో పని చేయాలి‘ అని దిశానిర్దేశర చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నతాధికారులతోపాటు శిక్షణ పూర్తి చేసుకున్న 271 మంది గ్రూప్-1, 171 మంది గ్రూప్-2 అధికారులు, 51 మంది మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీస్ ఉద్యోగులు పాల్గొన్నారు.

# పేదలే ఇందిరమ్మ ప్రభుత్వ పేటెంట్

- వెలుగుమట్లలో ఇళ్లు కూలగొట్టింది బీఆర్ఎస్ ప్రభుత్వమే
- ఆధారాలు చూపిన మంత్రి పొంగులేటి
- కేటీఆర్‌కు మంత్రుల స్ట్రాంగ్ కౌంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలపై బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను రాష్ట్ర మంత్రులు తీవ్రంగా ఖండించారు. “పేదలే ఇందిరమ్మ ప్రభుత్వ పేటెంట్” అని, బాధితులకు ఇళ్ల స్థలాలు మరియు ఇళ్లు ఇచ్చే పూర్తి బాధ్యత తమ ప్రభుత్వానిదేనని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. 2023 జూలై 15న వెలుగుమట్లలో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వమే పేదల ఇళ్లను కూలగొట్టించిందని, ఆ సంఘటనకు సంబంధించిన ఫోటోలను ప్రదర్శిస్తూ నిలదీశారు. అప్పట్లో ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి గాలికి వదిలేసిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు హైకోర్టు ఉత్తర్వుల మేరకు జరిగిన అక్రమ నిర్మాణాల తొలగింపుపై మొసలి కన్నీరు




కారుస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల ప్రకారం అర్హులైన ప్రతి పేదవాడికి ఇంటి స్థలం, ఇల్లు కచ్చితంగా ఇస్తామని ఆయన భరోసా ఇచ్చారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన లక్షల కోట్ల అవినీతిపై కూడా మంత్రులు నిప్పులు చెరిగారు. కమీషన్ల కోసమే ప్రాజెక్టును తప్పుగా నిర్మించి రాష్ట్ర సంపదను సముద్రం పాలు చేశారని, కాళేశ్వరం అవినీతి సొమ్ముతోనే బీఆర్ఎస్ దేశంలోనే అత్యంత ధనిక ప్రాంతీయ పార్టీగా మారిందని విమర్శించారు. కేసీఆర్ తన పాలనలో దోచుకున్న సొమ్ముతో పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని ఎద్దేవా చేశారు. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చినా కేంద్రం స్పందించకపోవడాన్ని బట్టి చూస్తే బీజేపీ-బీఆర్ఎస్ మధ్య ఉన్న రహస్య ఒప్పందం అర్థమవుతోందని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ హాజరై, నిర్మాణాత్మకమైన సలహాలు ఇవ్వాలని, గత ప్రభుత్వంలాగా తాము గొంతు నొక్కబోమని, ప్రతిపక్షానికి మాట్లాడే పూర్తి అవకాశం ఇస్తామని మంత్రులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# తెలంగాణలో భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- మొత్తం 45మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు
- పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** తెలంగాణలో భారీగా ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగాయి. మొత్తం 45 మందిని బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా అవసరాల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒకేసారి 45 మంది ఐఏఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బదిలీల్లో కలెక్టర్ల స్థాయిలో పెద్దఎత్తున మార్పులు చోటుచేసుకున్నాయి. పలు జిల్లాలకు కొత్త కలెక్టర్ల నియామకం జరిగింది. మహబూబాబాద్, మెదక్, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి జిల్లాలకు కొత్త కలెక్టర్లను నియమించారు. టీఎస్‌జీపీడీసీఎల్‌కు కొత్త సీఎండీ నియామకం జరిగింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ) ముఖ్యకార్యదర్శిగా రాహుల్ బొజ్జా నియమితులయ్యారు. బీసీ సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శిగానూ ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సంజయ్‌కుమార్, విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా దాన కిషోర్‌ను నియమించారు. ఫైనాన్స్ అండ్ ప్లానింగ్ విభాగం కార్యదర్శిగా గౌరవ్ ఉప్పల్, దేవాదాయశాఖ కమిషనర్‌గా ఎం.హనుమంతరావు,




ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారిగా డి.దివ్యను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు పలు జిల్లా కలెక్టర్లనూ ప్రభుత్వం బదిలీ చేసింది. యాదాద్రి భువనగిరి కలెక్టర్‌గా అనురాగ్ జయంతిని నియమించింది.పంచాయతీరాజ్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా సంజయ్ కుమార్‌ను నియమించారు. విపత్తు నిర్వహణ, రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా దాన కిషోర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా శ్రీధర్‌ను నియమించారు. ఎండోమెంట్స్ కమిషనర్‌గా హనుమంతరావుకు కొత్త బాధ్యతలు అప్పగించారు. ఫైనాన్స్ శాఖ సెక్రటరీగా గౌరవ్ ఉప్పల్‌ను నియమించారు. ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఎన్.శ్రీధర్‌కు బాధ్యతలు అప్పగించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా చిత్రా మిశ్రాను నియమించారు. విజయేంద్ర - మహబూబ్‌నగర్ కలెక్టర్ పదవి నుంచి సోషల్ వెల్ఫేర్ శాఖ కార్యదర్శిగా నియామకం అయ్యారు. అద్వైత్ కుమార్ సింగ్ - మహబూబాబాద్ నుంచి ఢిల్లీ తెలంగాణ భవన్ సమన్వయ శాఖకు బదిలీ అయ్యారు. సిక్తా పట్నాయక్ - నారాయణపేట్ నుంచి ఆర్థిక శాఖకు ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ అయ్యారు. సందీప్ కుమార్ ఝా - జనగాం కలెక్టర్‌గా నియామకం అయ్యారు. ముష్రఫ్ అలీ ఫారూఖీ - టీఎస్‌జీపీడీసీఎల్ సీఎండీగా నియామకం అయ్యారు. జితేష్ వి.పాటిల్ - టీఎస్‌జీపీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. స్నేహ శబరీష్ - మహబూబాబాద్ కలెక్టర్‌గా నియామకం అయ్యారు. గరిమా అగర్వాల్- రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా నియామకం జరిగింది. ప్రతిమ సింగ్ - మెదక్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అనికేత్ - భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా ,చాహత్ బజ్పాయి - హనుమకొండ కలెక్టర్‌గా,ఖుష్బూ గుప్తా - మహబూబ్‌నగర్ కలెక్టర్‌గా , పమేలా సత్పతి - లేబర్ కమిషనర్‌గా, అనురాగ్ జయంతి - యాదాద్రి కలెక్టర్‌గా ,ప్రదీప్ జైన్ - నారాయణపేట్ కలెక్టర్‌గా నియామకం జరిగింది.




# జర్నలిస్టులకు ఊరట

**అక్రిడిటేషన్ కార్డుల గడువు ఏప్రిల్ 30 వరకు పొడిగింపు**

**జీఓ 252, 103లపై హైకోర్టులో విచారణ.. ప్రభుత్వ వివరణకు ఆదేశం**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల చెల్లుబాటుపై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉన్న కార్డుల గడువును 2026 ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అక్రిడిటేషన్ నిబంధనలకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన జీఓ 252 మరియు సవరించిన జీఓ 103లను సవాలు చేస్తూ తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీయూడబ్ల్యూజేఎఫ్) దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు ఈ విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరపు న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ వాదనలు వినిపిస్తూ.. కొత్త జీఓల వల్ల జర్నలిస్టుల వృత్తిపరమైన కార్యకలాపాలకు, వారికి అందాల్సిన సదుపాయాలకు ఆటంకం కలుగుతోందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వం తరపున స్పెషల్ అడ్వకేట్ జనరల్ స్పందిస్తూ.. జర్నలిస్టులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు కార్డుల గడువును మరో రెండు నెలల పాటు (ఏప్రిల్ 30 వరకు) పొడిగిస్తున్నట్లు కోర్టుకు వివరించారు. ఈ వివరణను రికార్డులోకి తీసుకున్న ధర్మాసనం, ఏప్రిల్ నెలాఖరు వరకు పాత కార్డులే చెల్లుబాటు అవుతాయని స్పష్టం చేసింది. అక్రిడిటేషన్ నిబంధనల మార్పుపై ఫెడరేషన్ లేవనెత్తిన అభ్యంతరాలపై పూర్తి స్థాయి వివరణ సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేసింది.

# కుమ్మెర ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్‌సీ సీరియస్

**పోలీసుల నిర్లక్ష్యంపై ఆగ్రహం**

**నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం**

**కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు**

**బాధితులకు న్యాయం చేయాలని స్పష్టీకరణ**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** నాగర్‌కర్నూల్‌లో జరిగిన కుల వివక్ష దాడి , పోలీసుల నిర్లక్ష్యంపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్ అయ్యింది. ఘటనపై నాలుగు వారాల్లోగా నివేదిక ఇవ్వాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. న్యాయవాది వినోద్ హిందుస్థానీ దాఖలు చేసిన ఫిర్యాదుపై స్పందిం చిన కమిషన్, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీకి నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై తీసుకున్న చర్యల నివేదికను నాలుగు వారాల్లోగా సమర్పించాలని ఆదేశించింది. ఈనెల 18న కుమ్మెర మల్లన్న స్వామి జాతర సందర్భంగా చిలుకేశ్వరం చంద్రకళ కుటుంబాన్ని ఆలయంలోకి ప్రవేశాన్ని నిరాకరించడంతో పాటు రెండు నెలల పసికందును ఉద్దేశపూర్వకంగా తొక్కడంతో ఆ శిశువు మరణించింది. నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులు నిర్లక్ష్యం వహించడాన్ని తప్పుపడుతూ న్యాయవాది కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితులు నాగర్‌కర్నూల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లినప్పుడు, నిందితులకు ఉన్న రాజకీయ పలుకుబడి కారణంగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి అధికారులు నిరాకరించారని ఆరోపించారు. పోలీసులు రాజ్యాంగ రక్షణలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను సైతం ఉల్లంఘించారని కమిషన్ గుర్తించిందన్నారు. నిందితులను అరెస్టు చేయడం, విధి నిర్వహణలో విఫలమైన పోలీసు అధికారులపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని, బాధితులకు రక్షణతో పాటు పరిహారం అందించాలని కమిషన్ పేర్కొందని వివరించారు.. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం జరిగే ప్రక్రియలో రాజకీయ పలుకుబడి అడ్డంకి కాకూడదని నిర్ధారించడానికి కమిషన్ జోక్యం ఒక కీలక ముందడుగు అన్ని వినోద్ హిందుస్థానీ పేర్కొన్నారు

# ఇంటర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్

**పట్టుబడ్డ నలుగురు విద్యార్థులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:** రాష్ట్రంలో బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల రెండో రోజు గురువారం ఇంటర్ ద్వితీయ సంవత్సరం సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ మీడియట్ బోర్డు సెక్రటరీ తెలిపారు. మొత్తం 4,63,354 మంది విద్యార్థులకు గాను 4,52,980 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని వివరించారు. 10,374 మంది గైర్హాజరయ్యారని వెల్లడించారు. వరంగల్‌లో 3, రంగారెడ్డి జిల్లాలో ఒకరు మాల్ ప్రాక్టీసు కు పాల్పడుతూ అధికారులకు పట్టుబడ్డారని పేర్కొన్నారు. వనపర్తి, వికారాబాద్, భద్రాద్రి, ఆదిలాబాద్, మంచిర్యాల, వరంగల్, సిద్దిపేట, మెదక్, కరీంనగర్, ములుగు, పెద్దపల్లి పరీక్షా కేంద్రాల పర్యవేక్షణకు పరిశీలకులను నియమించినట్లు తెలిపారు.





సంపాదకీయం

# మమతా బెనర్జీ కళ్లు తెరవాలి!

బెంగాల్లో సర్ ప్రక్రియపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో అక్కడ జ్యుడిషియల్ అధికారుల అజమాయిషీలో జరగాలని ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతోపాటే సర్ ప్రక్రియను అడ్డుకోరాదని మమతా బనర్జీకి సుప్రీం గట్టిగానే సూచించింది. నిజానికి సర్ ప్రక్రియ ద్వారా ఓట్లను సంస్కరించడం అవసరమే. తమిళనాట లక్షల్లో ఓట్లు తొలగించారు. గుజరాత్‌లోనూ తొలగించారు. ఇప్పుడు దక్షిణాదిలో కూడా సర్ ప్రక్రియ కొనసాగనుంది. ఈ క్రమంలో ఓట్లు తొలగింపు వల్ల ఎవరైనా తమ ఓటు నిజంగానే కోల్పోతే వారి పక్షాన ప్రభుత్వం పోరాడాలి. అంతే తప్ప అడ్డుకోవడం సరికాదు. ఇదేదో రాజ్యాంగ విఘాతం కలిగించారన్న రీతిలో ప్రచారం చేయడం విపక్షాలకు తగదు.

ఎన్నికల కమిషన్ ఏం చేసినా, ఎలా చేసినా విమర్శించే విపక్ష స్థానంలో ఉన్న కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డిఎంకెపార్టీలు తీవ్రంగా అడ్డుపడు తున్నాయి. బ్యాలెట్ బాక్స్ లతో ఓటింగ్ విధానం ఎలక్ట్రానిక్ ఓటింగ్ పద్ధతికి మారాక కొన్ని ఎన్ని కల వరకూ బాగా నడిచిందని ప్రశంసలు ఇచ్చిన పార్టీలు ఇప్పుడు ఆ విధానం వల్ల తమకు నష్టం వాటిల్లుతోందని ఘోషిస్తున్నాయి. పార్టీ ఏదైనా తమకు ఓటింగ్ అనుకూలంగా రాకపోయి ఓటమిపాలైతే ఎలక్ట్రానిక్ ఓటింగ్ పక్రి యలో లోటుపాట్లు ఉన్నందునే తాము ఓడిపోయామని విమర్శలు గుప్పిస్తున్నారు. విపక్ష పార్టీలు తమ స్థానాలు మారినా విమర్శలకు వెనుకాడడం లేదు. 'సర్' పేరెత్తితేనే విపక్షాల్లో అదీ అతి ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ అపచారం జరిగిందని అంటున్నారు. ఇలా కాకుండా ఎక్కడైనా ఓట్ల తొలగింపుతో ఎవరైనా నష్టపోతే దానిని ఆధారంగా చేసుకుని పోరాడాలి. కానీ మొత్తం ప్రక్రియనే వ్యతిరేకించడం ద్వారా రాజ్యాంగాన్ని తృణీకరిస్తున్నాయని గుర్తించాలి. సుప్రీం ఇచ్చిన ఆదేశాలు లేదా సూచనలు ఆయా రాజకీయ పార్టీలకు కనువిప్పు కావాలి. ఇంకా సర్ ప్రక్రియను అప్రతిష్టపాలు చేయాలనే ఆలోచన నుంచి రాజకీయ పార్టీలు బయటపడాలి. ఎన్నికల కమిషన్ పై సవాల్ చేసిన కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీపై తమ నిరసన ధ్వనులను పెంచుతున్నాయి. ఒకపక్క ఎన్నికల కమిషన్ త్వరలో ఎన్నికలు జరిగే పశ్చిమబెంగాల్, తమిళ నాడు, కేరళ వంటి రాష్ట్రాలలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ (సర్) కార్యక్రమాన్ని చేపట్టగా కాంగ్రెస్ అధ్యక్షు డు రాహుల్గాంధీ, 'ఓట్ చోరీ' ప్రచార కార్యక్రమాన్ని బహుళ ప్రచారం చేస్తున్నారు. బీహార్ ఎన్నికల్లో చతికిలపడినా ఓటరు జాబితా విషయంలో రాజీ పడేది లేదనే ధోరణిలో ముందుకు కదులుతున్నారు. బీహార్లో 'సర్' కార్యక్రమం చేపట్టినప్పుడు ఎన్నికల కమిషన్ను కాంగ్రెస్ పార్టీ విపరీ తంగా ఆరోపణలు గుప్పించింది. ఎన్నికల కమిషన్ తన ధోరణిలో తనప్రణాళిక ప్రకారం ఓటరు జాబితా సవరణ కార్యక్రమం చేపట్టింది. ఎన్నికలు సజావుగానే నడిపించింది. బీహార్లో అప్పటికే అధికారంలో ఉన్న పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. అంటే విపక్షాల అభ్యంతరాలు ఎవరినీ కదిలించలేదన్నది సుస్పష్టం. అయినా కాంగ్రెస్ తదితర పక్షాలు తాము పట్టిన కుందేటికి మూడే కాళ్లన్న ధోరణిలో తమ పిడివాదంతో విమర్శలు గుప్పిస్తున్నాయి. ఓటు దొంగల కబంధ హస్తాల నుంచి భారత ప్రజాస్వామ్యాన్ని రక్షించే నినాదంతో కాంగ్రెస్ సంతకాల సేకరణ చేస్తోంది. బీహార్ ఫలితాల తర్వాత కాంగ్రెస్ పార్టీ తన ఆలోచనలో మార్పు తెచ్చుకోగలదని అందరూ భావించారు. కానీ అలా జరుగలేదు. కనీసం ఆది నుంచీ ఒకే మాటమీద వ్యవహా రాన్ని నడిపిస్తున్నారు. బోగస్ ఓట్లను చేర్చడం, విపక్ష అనుకూల ఓటర్లను తొలగించడం, ఓటర్ల జాబితాలో అవకతవకలకు పాల్పడడం వంటివి ఎన్నికల కమిషన్ భారతీయ జనతా పార్టీలు కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయన్నది కాంగ్రెస్ ఆరోపణలు. బిజెపి ఓటర్లకు ఆయా నియోజక వర్గాల్లో నగదు పంచుతున్నా చర్యలు తీసుకోకుండా, ఇసి సహకరిస్తోందని విపక్షాలు గట్టిగా నమ్ముతున్నాయి. తాజాగా పశ్చిమ బెంగాల్లో ఓటర్ల జాబితా సవరణ మొదలైంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఎన్నికల కమిషన్పై రుసరుసలాడుతున్నారు. దేశవ్యాప్తంగా ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఒక ఉద్దేశపూర్వక కుట్రగా అభివర్ణించారు. బీహార్ లో 'సర్' అమలులో విజయవంతమైన కార్యక్రమంగా రూపొందించి దేశవ్యాప్తంగా ఇలాంటి కార్యక్రమాన్ని చేప ట్టేందుకు ఇసి నిర్ణయం తీసుకుందంటే అది ఎంతోమంచి కార్యక్రమమేననుకోవాలి. అయినా బిజెపియేతర ఇండియా కూటమిలు ప్రధానపక్షమైన కాంగ్రెస్ఎన్నికల కమిషన్ వివవరణలను ఆకళింపు చేసుకోలేకపోయింది. దానికితోడు దేశవ్యాప్త 'సర్' విచారణ కోసం నియమితులైన 16మంది బిఎల్ఎలు ఒత్తిడి వల్లనే మరణించారన్న వార్తలను ఆసరాగా చేసుకుని ఇసి ఒత్తిడిలపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. పశ్చిమ బంగలోని ధులగోరి, బిరాటి, న్యూటేన్ ఘుసురి వంటి ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే బంగ్లా దేశీయులు ఓటర్ల జాబితా ఏరివేతలో తగు పత్రాలు చూపలేక అక్రమంగా వలస వచ్చినట్లు తేలినవారంతా ఇప్పుడు బంగ్లాదేశ్ దారిపట్టారు. ఇప్పుడీ కార్యక్రమం వలన పశ్చిమ బెంగాల్లో సంక్లిష్ట పరిస్థితులేర్పడ్డా యి. బంగ్లాదేశ్ నుంచి వచ్చి బెంగాల్లో ఉండేవారి పత్రా లను చూసే పనిని బిఎస్ఎఫ్ జవాన్లకు అప్పగించారు. వెనక్కివెళ్లే సమయంలోనూ వీరే వారిపత్రాలను పరిశీ లించి పోలీసులకు పంపాల్సి ఉంటుంది. ఈ పక్రియ ఎంతో కష్టమైనది. సుదీర్ఘమైనది. బంగ్లాదేశీయుల రివర్స్ మైగ్రే షన్తో బెంగాల్ పోలీసులు సతమత మవుతున్నారు. సరైన పత్రాలు లేనివారిని నిర్బంధించి జైల్లోపెట్టే పరిస్థితి ఉంది. నిజానికి బంగ్లాదేశీయులు పశ్చిమ బెంగాల్లో ప్రవేశించిన ప్పుడు దళారీల ద్వారా ఆధార్ కార్డులు రేషన్ కార్డులు, ఓటరు ఐడీలతో ప్రవేశించారు. ఇప్పుడు అలాంటి ఎన్నీ బయటపడి పత్రాలన్నీ నకిలీవని తేలుతున్నందున మమతా బెనర్జీ సిగ్గుపడాలి.





# భారత్-ఇజ్రాయెల్ సరికొత్త మైత్రి

- త్వరలో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం..
- యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఎంవోయూ
- ఏఐ, వ్యవసాయ రంగాల్లో 27 కీలక ఒప్పందాలు
- ఇజ్రాయిల్ పర్యటనలో ప్రధాని ప్రకటన
- భారత్‌కు రుణపడి ఉన్నానన్న నెతన్యాహు





**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** ఇజ్రాయెల్-భారత్ మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరనుందని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. అలాగే ఇజ్రాయెల్‌లో కూడా త్వరలో యూపీఐ సేవలను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ మేరకు యూపీఐ పేమెంట్స్ విషయంలో ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. యూపీఐ పేమెంట్స్‌తో పాటు ఏఐ, వ్యవసాయం తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరా యి. రెండు దేశాల మధ్య త్వరలోనే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం జరగనున్నట్టు ఇరు దేశాల ప్రధానులు సంయు క్త ప్రకటనలో వెల్లడించారు. మొత్తం 27 రంగాల్లో పరస్ప ర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయి. మరోవై పు గాజాపై ప్రధాని మోదీ మరోసారి భారత్ వైఖరిని స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ సంఘర్షణకు బలికాకూడదన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుందని మోదీ హామీ ఇచ్చారు. ÷ూగా, త్వరలోనే భారత పర్యటనకు రావాల్సిందిగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహును ఆహ్వానించారు. అంతకు ముందు ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో ప్రధాని మోదీ చేసిన ప్రసంగాన్ని నెతన్యాహు ప్రశంసించారు. ఆయన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందని అన్నారు. భారత్ కు రుణపడి ఉన్నామన్నారు. మోదీ తమకు స్నేహితుడు కంటే ఎక్కువని అభివర్ణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ పర్యటన రెండు దేశాల మధ్య సరికొత్త మైత్రికి నాంది పలికింది. విమానాశ్రయం నుంచి ఇజ్రాయెల్ పార్లమెంట్ వరకు మోడీకి లభించిన ఘన స్వాగతం ఈ పర్యటన ప్రాధాన్యతను చాటిచెప్పింది. పర్యటనలో భాగంగా నిర్వహించిన సంయుక్త విలేకరుల సమావేశంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తన వ్యక్తి గత విషయాన్ని ఒకటి పంచుకొని అందరినీ ఆశ్చర్యపరి చారు. ఈ సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి నెతన్యాహు మాట్లాడుతూ.. తన భార్యతో తన మొదటి డేట్ ఒక భారతీయ రెస్టారెంట్‌లో జరిగిందని, ఆ భోజనం అద్భుతంగా ఉండటం వల్లే వారి బంధం బలపడిందని సరదాగా వ్యాఖ్యానించారు. దీనికి తాను, తన పిల్లలు కూడా భారత్‌కు రుణపడి ఉంటామని ఆయన అనగానే ప్రధాని మోడీ నవ్వు ఆపుకోలేక పోయారు. భారతదేశంలోని అపారమైన ప్రతిభను, ఇజ్రాయెల్‌లోని సాంకేతిక పరిజ్ఞానాన్ని కలపడం ద్వారా అద్భుతాలు సృష్టించవచ్చని ఇద్దరు నేతలు ఆకాంక్షించారు. ప్రధానంగా కచ్చితమైన వ్యవసాయం, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగాల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నారు. ఆవిష్కరణలు, సాంకేతికత, అభివృద్ధికి సంబంధించి రెండు దేశాల మధ్య 16 కీలక అవగాహన ఒప్పందాలు జరిగాయి. రెండు దేశాల మధ్య స్నేహాన్ని మరింత బలోపేతం చేసేందుకు త్వరలోనే భారత్‌లో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని నేతలు నిర్ణయించారు. 'మా వ్యక్తిగత స్నేహం, ప్రభుత్వాల మధ్య సహకారం, ప్రజల మధ్య అనుబంధం నానాటికీ బలపడుతోంది' అని నెతన్యాహు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. దీనిని కొనసాగించేందుకు సాధ్యమైనంత త్వరగా భారతదేశంలో ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పర్యటన కేవలం దౌత్యపరమైన ఒప్పందాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఇద్దరు దేశాధినేతల మధ్య ఉన్న బలమైన వ్యక్తిగత స్నేహాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది.



# బ్యాంకింగ్ యాప్స్‌లో 'డార్క్ ప్యాటర్న్స్'కు చెక్

## ఆర్‌బీఐ సంచలన నిర్ణయం!

**ముంబై, ఫిబ్రవరి 26:** భారతదేశంలో డిజిటల్ బ్యాంకింగ్ వాడుతున్న కోట్లాది మంది వినియోగదారులకు ఊరటనిచ్చేలా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక మార్గదర్శకాలను విడుదల చేసింది. బ్యాంకింగ్ యాప్‌లు, వెబ్‌సైట్లలో వినియోగదారులను గందరగోళానికి గురిచేస్తూ, వారి ప్రమేయం లేకుండా అదనపు సేవలను రుద్దే 'డార్క్ ప్యాటర్న్స్' పద్ధతులపై ఆర్‌బీఐ ఉక్కుపాదం మోపింది. ఈ మేరకు 'రెస్పాన్సిబుల్ బిజినెస్ కండక్ట్ అమెండ్‌మెంట్ డైరెక్షన్ 2026' పేరుతో ముసాయిదా నిబంధనలను ప్రకటించిన ఆర్‌బీఐ, దేశంలోని అన్ని వాణిజ్య బ్యాంకులు తమ డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉన్న ఇటువంటి మోసపూరిత డిజైన్లను 2026 జూలై నాటికి పూర్తిగా తొలగించాలని ఆదేశించింది. సాధారణంగా ఏదైనా ట్రాన్సాక్షన్ చేస్తున్నప్పుడు చివరి నిమిషంలో తెలియకుండానే అదనపు ఛార్జీలు పడటం, ఇన్సూరెన్స్ వంటి సేవలను కొనుగోలు చేయమని పదేపదే నోటిఫికేషన్లు రావడం వంటివి డార్క్ ప్యాటర్న్స్ కిందకు వస్తాయి. ఇవి వినియోగదారుల నిర్ణయాధికారాన్ని దెబ్బతీస్తూ వారిని తప్పుదారి పట్టించేలా ఉన్నాయని ఆర్‌బీఐ గుర్తించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం ఏదైనా ఆర్థిక ఉత్పత్తిని విక్రయించేటప్పుడు కస్టమర్ నుంచి స్పష్టమైన అనుమతి తీసుకోవాలని, కస్టమర్లు అడగని థర్డ్ పార్టీ ఉత్పత్తులను బలవంతంగా అంటగట్టకూడదని స్పష్టం చేసింది. బ్యాంకులు ఇచ్చే ప్రకటనలు వాస్తవాలకు దగ్గరగా ఉండాలని, వడ్డీ రేట్లు, ఇతర ఛార్జీల గురించి పూర్తి సమాచారాన్ని ముందే బహిర్గతం చేయాలని ఆదేశించింది. ఆర్‌బీఐ తీసుకున్న ఈ నిర్ణయం వల్ల డిజిటల్ బ్యాంకింగ్ మరింత సురక్షితం కానుందని, వినియోగదారులకు తెలియకుండా జరిగే అనవసర ఖర్చులు తగ్గుతాయని నిపుణులు భావిస్తున్నారు.

# ట్రంప్‌కు మరో ఎదురుదెబ్బ

## వసలదారుల పట్ల అనుసరిస్తున్న విధానంపై కోర్టు ఆగ్రహం



**న్యూయార్క్, ఫిబ్రవరి 26:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఆ దేశ న్యాయస్థానాల్లో వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విషయాల ఇప్పటికే కోర్టు నుంచి వ్యతిరేక తీర్పు రాగా.. తాజాగా వలసదారుల విషయంలోనూ అదే అనుభవం ఎదురైంది. అక్రమ వలసదారులను వారికి సంబంధం లేని ఇతర దేశాలకు తరలించడాన్ని అక్కడి ఫెడరల్ కోర్టు తప్పుబట్టింది. అక్రమ వలసదారుల విషయంలో ట్రంప్ కార్యవర్గం తీసుకున్న నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేస్తూ మసాచుసెట్స్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి తీర్పునిచ్చారు. డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత అక్రమ వలసదారులను టా÷-గ్గ÷ట్ చేసిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను అమెరికా నుంచి గ్వాటమాల, దక్షిణ సూడాన్, కోస్టారికా వంటి ఇతర దేశాలకు తరలించారు. దీంతో ఈ తరలింపు ముప్పును ఎదుర్కొంటున్న వలసదారులు కోర్టులో దావా వేశారు. దావాపై తాజాగా న్యాయస్థానంలో విచారణ జరిగింది. సరైన భద్రతా చర్యలు తీసుకోకుండా, ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, తగిన సమయం ఇవ్వకుండా వారికి సంబంధం లేని వేరే దేశాలకు తరలించడం చట్ట విరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది (÷బిౖటౖసజీ ఇనీబీసబి తిపపతిణసజీబితినీని ఇజీబౖ). ట్రంప్ కార్యవర్గం నిర్ణయాన్ని తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. ఈ తీర్పుపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకునేందుకు ట్రంప్ యంత్రాంగానికి 15 రోజుల సమయం ఇచ్చింది.

# ఎన్‌సీఈఆర్‌టీ వివాదంపై మోదీ అసంతృప్తి



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** జాతీయ విద్యాపరిశోధన-శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్‌టీ) 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ అసంతృప్తి వ్యక్తం చేశారట. ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. 'వీటన్నింటినీ ఎవరు పర్యవేక్షిస్తున్నారు?.. బాధ్యులను గుర్తించారా? ' అని మోదీ ప్రశ్నించారట. ఇక, ఈ విషయంపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విచారం వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'మేము న్యాయ వ్యవస్థకు అత్యున్నత స్థానం ఇచ్చాం. న్యాయ వ్యవస్థను కించపరచాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఇసుమంత కూడా లేదు. మేము ఈ విషయాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నాము. న్యాయ వ్యవస్థ తీసుకున్న నిర్ణయంతో ఏకీభవిస్తున్నాము. జరిగిన దానికి నేను ఎంతో చింతిస్తున్నా' అని అన్నారు.

# భారతీయ రైల్వేల్లో డిజిటల్ విప్లవం

- 'రైల్ టెక్' పోర్టల్, 'ఈ-ఆర్సీటీ' వ్యవస్థ ప్రారంభం
- 52 వారాల్లో 52 సంస్కరణలు
- స్టార్టప్‌లు, ఆవిష్కర్తలకు పెద్దపీట


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26:** భారతీయ రైల్వే రంగాన్ని సాంకేతికంగా మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ "52 వారాల్లో 52 సంస్కరణలు" అనే వినూత్న కార్యక్రమంలో భాగంగా పలు కీలక డిజిటల్ వేదికలను ప్రారంభించారు. ఇందులో భాగంగా రైల్వే రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు 'రైల్ టెక్' పాలసీని ప్రకటించడంతో పాటు, దానికి సంబంధించిన ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారు. అలాగే రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ కార్యకలాపాలను సులభతరం చేసేందుకు 'ఈ-ఆర్సీటీ' డిజిటల్ వ్యవస్థను కూడా ఆయన ప్రారంభించారు.

### ఆవిష్కర్తలకు నేరుగా అవకాశం


కొత్తగా ప్రారంభించిన రైల్ టెక్ పోర్టల్ ద్వారా స్టార్టప్ కంపెనీలు, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, వ్యక్తిగత ఆవిష్కర్తలు తమ అత్యాధునిక సాంకేతిక ఆలోచనలను నేరుగా రైల్వే శాఖకు తెలియజేయవచ్చు. దీనివల్ల భారతీయ రైల్వేలో ఆధునిక సాంకేతికతను వ్యవస్థబద్ధంగా ప్రవేశపెట్టేందుకు వీలు కలుగుతుంది. దేశీయ పరిజ్ఞానంతో రైల్వే రంగాన్ని ఆధునీకరించాలనే లక్ష్యంతో ఈ పోర్టల్‌ను రూపొందించినట్లు మంత్రి తెలిపారు.

### క్లెయిమ్స్ పరిష్కారంలో వేగం

రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌లో తీసుకువచ్చిన 'ఈ-ఆర్సీటీ' వ్యవస్థ ద్వారా బాధితులకు సత్వర న్యాయం అందనుంది. ప్రమాదాలు లేదా ఇతర ఘటనలకు సంబంధించి క్లెయిమ్‌లను ఇకపై 24 గంటల పాటు ఆన్‌లైన్‌లోనే (ఈ ఫైలింగ్) దాఖలు చేసుకోవచ్చు. రియల్ టైమ్ కేసు ట్రాకింగ్, పేపర్‌లెస్ కోర్టులు, హైబ్రిడ్ విచారణలు మరియు ఆన్‌లైన్ తీర్పులు వంటి సదుపాయాలు ఈ వ్యవస్థ ద్వారా అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల బాధితులు ట్రిబ్యునల్‌ను ప్రత్యక్షంగా సందర్శించాల్సిన అవసరం లేకుండానే తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు. రాబోయే 12 నెలల్లో దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ బెంచ్‌లను పూర్తిగా డిజిటలైజ్ చేయనున్నట్లు మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ సందర్భంగా ప్రకటించారు.



# నదుల అనుసంధానమే శ్రీరామరక్ష




- వంశధార నుంచి పెన్నా వరకూ నదులను అనుసంధానించాలి
- పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుతో మేలు
- కాళేశ్వరం కట్టినా మేం అభ్యంతరం చెప్పలేదు
- గోదావరిలో వృధా జలాలు వినియోగంలోకి తెస్తాం
- నదుల అనుసంధానంతో తెలుగుతల్లికి జలహారతి పడతా
- తాగు,సాగునీటి సరఫరా లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణం
- సాగునీటి రంగంపై శాసనసభలో సీఎం చంద్రబాబు

**అమరావతి, ఫిబ్రవరి 26:** పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టు వల్ల ఎవరికీ నష్టం లేదని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మరోమారు స్పష్టం చేశారు. గోదావరి నుంచి సముద్రంలోకి వెళ్లే వృథాగా వరద జలాలను.. ఆయా ప్రాజెక్ట్‌లకు తరలిస్తామని పేర్కొన్నారు. గోదావరిపై ఎగువన తెలంగాణ రాష్ట్రం కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిందని, దీనికి తాము అభ్యంతరం చెప్పలేదని ప్రస్తావించారు. రెండు తెలుగు రాష్ట్రాలకూ దీని వల్ల లాభం కలుగుతుందని ఉద్ఘాటించారు. పోలవరం - నల్లమల సాగర్ లింకు ప్రాజెక్టుకి పొరుగు రాష్ట్రం అభ్యంతరం చెప్పాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. ప్రకృతిని ఆరాధించడం.. నీటిని పూజించే సంప్రదాయం మనదని సీఎం చంద్రబాబు అన్నారు. గోదావరికి అఖండ హారతి ఇచ్చామని, కృష్ణాకు పవిత్ర హారతి ఇచ్చామని గుర్తు చేస్తూ.. నదులను పూజించడం సంప్రదాయంగా పెట్టుకున్నామని తెలిపారు. సాగునీటి రంగంపై సీఎం చంద్రబాబు శాసనసభలో మాట్లాడారు. గంగా- కావేరి అనుసంధానం కావాలనేది నా ప్రగాఢ ఆకాంక్ష అని చెప్పారు. ఏ పనైనా చిన్న ఆలోచనతోనే మొదలవుతుంది. గంగా-కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయి. నదుల అనుసంధానం చేసి తెలుగుతల్లికి జలహారతి ఇచ్చే బాధ్యత మాది. నదుల అనుసంధానం వల్ల నీటి సమస్యలు తగ్గుతాయి. రాష్ట్రంలో కట్టిన ప్రాజెక్టులన్నీ ఎన్డీయే లేదా తెదేపా హయాంలోనే జరిగాయి. పట్టిసీమ నుంచి 100 టీఎంసీలు కృష్ణాకు తీసుకొచ్చాం. వెలిగొండ ప్రాజెక్టుకు నేనే శంకుస్థాపన చేశా... నేనే పూర్తి చేస్తున్నా. ధవళేశ్వరం వద్ద బ్యారేజీ నిర్మాణం వల్ల కాటన్ దొరను ఇప్పటికీ గుర్తుపెట్టుకుంటున్నారు. గోదావరి జిల్లాల్లో కాటన్ దొర విగ్రహాలు పెట్టి పూజిస్తున్నారని చంద్రబాబు అన్నారు. 2047 విజన్‌లో భాగంగా కూటమి ప్రభుత్వం ప్రధానంగా నీటి భద్రతపైనే దృష్టి సారించిందని సీఎం వ్యాఖ్యానించారు. గోదావరి, కృష్ణా పుష్కరాలను కూడా ఘనంగా నిర్వహించే బాధ్యత తమ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. గోదావరికి అఖండ హారతి, కృష్ణా నదికి పవిత్ర హారతి ఇవ్వడం ద్వారా జలాలను అత్యంత విలువైన వనరుగా భావిస్తున్నామని పేర్కొన్నారు. గోదావరి నది నుంచి సగటున ఏడాదికి 3 వేల టీఎంసీల నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయని వివరించారు. వంశధార నుంచి పెన్నా వరకూ రాష్ట్రంలో నదులను అనుసంధానిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని సీఎం చంద్రబాబు వెల్లడించారు. గంగా-కావేరీ అనుసంధానం జరగాలన్నది తన ప్రగాఢమైన ఆకాంక్ష అని చెప్పుకొచ్చారు. గంగా - కావేరి అనుసంధానం సాధ్యాసాధ్యాలపై ఆనాడే చర్చలు జరిగాయని ప్రస్తావించారు. నదులు అనుసంధానం చేసి, తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా ద్వారా 738 కిలోమీటర్ల మేర కాలువలను విస్తరించి కుప్పంలో పరమ సముద్రం చెరువు వరకూ నీరిచ్చామని వివరించారు. మడకశిర వరకూ నీళ్లు తీసుకెళ్లి ఆ ప్రాంత దాహార్తిని తీర్చామన్నారు. ఎన్టీఆర్ హయాంలోనే రాయలసీమకు తెలుగు గంగ, గాలేరు నగరి, హంద్రీనీవా లాంటి ప్రాజెక్టులు చేపట్టినట్లు ప్రస్తావించారు. సాగునీటిపై 2014 నుంచి 2019లో రూ.68 వేల కోట్లు ఖర్చు చేశామని పేర్కొన్నారు. గడిచిన 20 నెలలుగా రూ.20 వేల కోట్ల వరకూ ఖర్చు చేయగలిగామని వివరించారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకూ నీరిచ్చి, శ్రీశైలంలో నీటిని పొదుపు చేసి 100 టీఎంసీలను రాయలసీమకు తరలించామని వెల్లడించారు. అందుకే ఆ ప్రాంతం రతనాల సీమగా మారిందన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి మార్కాపురంతో సహా వివిధ ప్రాంతాలకు న్యాయం చేస్తామని సీఎం చంద్రబాబు భరోసా కల్పించారు. ఆర్థిక ఇబ్బందులున్నా కూడా మార్కాపురం, ఒంగోలు జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని సీఎం చంద్రబాబు మాటిచ్చారు. 30 ఏళ్ల ముందు ఆ ప్రాజెక్టు శంకుస్థాపన చేసి.. మొదటి దశను ఈ ఏడాది జూలైలోనే పూర్తి చేసి నీళ్లు ఇస్తామని చెప్పుకొచ్చారు. వెలిగొండ ప్రాజెక్టుకు రూ.2500 కోట్ల మేర ఇంకా ఖర్చు చేయాల్సి ఉందని వివరించారు. రూ.456 కోట్లతో ఫీడర్ కాలువ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశామని అన్నారు. ఈ క్రెడిట్ మొత్తం వైసీపీనే చోరీ చేస్తోందని ఆగ్రహించారు. వెలిగొండకు నీళ్లు రాకుండానే జగన్ రెడ్డి రిబ్బన్ కట్ చేశారని ఎద్దేవా చేశారు. కుప్పం లోనూ ట్యాంకర్లు తీసుకువచ్చి కాలువలో పోశారని విమర్శించారు. జగన్ హయాంలోని ఐదేళ్లలో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులని నిర్లక్ష్యం చేశారని ధ్వజమెత్తారు. రూ.2 వేల కోట్లతో ఉత్తరాంధ్ర ప్రాజెక్టులన్నీ దశలవారీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. డయాఫ్రాం వాల్‌ను గోదాట్లో కలిపేశారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో మళ్లీ ఆ ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నామని చెప్పుకొచ్చారు. పుష్కరాలకంటే ముందు ఆ ప్రాజెక్టు పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని మాటిచ్చారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేసి ఏలూరు, కృష్ణా జిల్లాలకు నీరు అందించేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. 1312 టీఎంసీల నీటిని ఏపీ ప్రాజెక్టుల్లో నిల్వ చేసుకునే అవకాశం ఉందని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'ప్రస్తుతం 793 టీఎంసీల నీటితో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లూ కళకళలాడుతున్నాయి. మే 15 తేదీన నారుమళ్లకు నీరిచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. 16 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ సాగుతో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ ఉంది. నీటి నిర్వహణ నుంచి పొదుపు చేసే వరకూ నీటి వినియోగదారుల సంఘాలకు అప్పగిస్తున్నాం. ఏపీ వ్యాప్తంగా భూగర్భ జలాల పెంపునకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నాం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా సగటున 7 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. భూగర్భజలాలు గణనీయంగా పెరగటంతో కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ మోటార్ల ద్వారా వినియోగం కూడా తగ్గింది. తద్వారా రూ.91 కోట్ల మేర విద్యుత్ కూడా ఆదా అయ్యింది. ఏపీలో 50 శాతం గ్రీన్ కవర్ పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఒక్క తిరుమలలోనే 89 శాతం మేర పచ్చదనం ఉంది. గత పాలనలో గుండ్ల కమ్మ గేట్లు కొట్టుకుపోతే గేట్లు పెట్టేందుకు కూడా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వైసీపీ హయాంలో పోలవరం డయాఫ్రాం వాల్ కొట్టుకుపోతే.. దాన్ని కూడా గుర్తించలేదు. జగన్ హయాంలో చేయని తప్పునకు నన్ను 53 రోజుల పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలోని ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలనే లక్ష్యంతోనే పనిచేస్తున్నాను. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్టుకున్నాయో చూశాం. నీరుంటే ఎలాంటి సమస్యలూ రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యల్ని తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్ సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నాను. వ్యవసాయానికి, పరిశ్రమలకు నీరు ఇవ్వడంతో పాటూ ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యాన్ని సాధించినట్లే. తెలుగు తల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకూ నీరిచ్చే ధృఢ సంకల్పంతో పనిచేస్తున్నాం. రాష్ట్రంలో ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు బ్లూ ప్రింట్‌ను కూడా సిద్ధం చేస్తున్నాం' అని సీఎం నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. చేయని నేరానికి నన్ను గత పాలకులు.. 53 రోజులు పాటు జైల్లో పెట్టారు. రాష్ట్రంలో ప్రతి ఎకరాకూ నీరు ఇవ్వాలన్న లక్ష్యంతోనే పని చేస్తున్నా. కావేరిపై రెండు రాష్ట్రాలు ఎలా కొట్లాడుకుంటున్నాయో చూశాం. నీరు పుష్కలంగా ఉంటే ఎలాంటి సమస్యలు రావు. నీటి భద్రతను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. కొందరు రాజకీయం కోసమే నీటి సమస్యలను తీసుకొస్తున్నారు. ఏపీకి ఉండే వాటర్‌సెక్యూరిటీ దక్షిణ భారత్‌లో మరే రాష్ట్రానికీ లేదు. భూమినే జలాశయంగా మార్చి నీటి సంరక్షణ చేయాలని అందరికీ పిలుపునిస్తున్నా. సాగునీరు, పరిశ్రమలకు నీరు, ప్రతి ఇంటికీ తాగునీరు ఇస్తే లక్ష్యం సాధించినట్లే. తెలుగుతల్లికి జలహారతి ఇచ్చేలా ప్రతి ఎకరాకు నీరివ్వాలని సంకల్పం. రాష్ట్రంలో ప్రాజెక్టుల పూర్తికి బ్లూప్రింట్ సిద్ధం చేస్తున్నాం అని చంద్రబాబు వివరించారు.

# గాలేరు-నగరిపై మండలిలో వాదోపవాదాలు

- రాయలసీయ ఎత్తిపోతల ఎప్పటికి పూర్తి చేస్తారన్న బొత్స
- వినే ఓపిక ఉండాలని మంత్రి నిమ్మల ఎదురుదాడి



**అమరావతి, ఫిబ్రవరి 26:** గాలేరు-నగరిపై చర్చలో అధికార, ప్రతిపక్షం మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. గాలేరు నగరి ప్రాజెక్టుపై వైసీపీ సభ్యులు ప్రశ్న లేవనెత్తారు. వరద నీరు కేవలం 30 రోజులు మాత్రమే వస్తుందని.. జగన్ ప్రభుత్వం 3,825 కోట్ల రూపాయలతో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. గాలేరు నగరి ప్రాజెక్టుకు ఎంత బడ్జెట్ కేటాయించారని.. ఎప్పటిలోగా పూర్తి చేస్తారని ప్రశ్నించారు. మూడోసారి వాయిదా అనంతరం ఏపీ శాసనమండలి తిరిగి మొదలైంది. రాయలసీయ నీటి ప్రాజెక్టులపైనే మండలిలో మరోసారి రచ్చ జరిగింది. గాలేరు నగరి ప్రాజెక్టు, రాయలసీమ ఎత్తిపోతల పథకం విషయాలపై వైసీపీ సభ్యులు ప్రశ్నలు సంధించగా మంత్రులు సమాధానాలు ఇచ్చారు. మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇస్తూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకానికి ఇతర ఎత్తిపోతల పథకాలకు ఉన్న తేడా తెలుసుకుని ప్రశ్నలు అడగాలని సూచించారు. ధైర్యంగా వాకౌట్ చేయకుండా సమాధానాలు వినాలన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకంపై మరోసారి వివరాలు చెబుతానని మంత్రి తెలిపారు. సందర్భంగా బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాయలసీమ ఎత్తిపోతల పథకం అందరికీ అవసరమన్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు వాస్తవమా? కాదా? అని ప్రశ్నించారు. ఈ పథకాన్ని ఎప్పటిలోగా ప్రారంభించి, ఎప్పటిలోగా పూర్తి చేస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్ని ట్రిబ్యునల్ గొడవలు వచ్చినా ఆనాటి ప్రభుత్వం ముందుకు వెళ్లిందని బొత్స సత్యనారాయణ గుర్తు చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు మరోసారి స్పందిస్తూ.. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన రోజే మాజీ మంత్రి హరీశ్ రావు కూడా మాట్లాడారని అన్నారు. 'జగన్‌తో మాట్లాడాం... అంతకుమించి ముందుకు వెళ్ళవద్దని జగన్‌కు చెప్పినట్లు బీఆర్ఎస్ నాయకులు చెప్పారు' అని తెలిపారు. తెలంగాణ రాజకీయ ప్రయోజనాల కోసం వారు మాట్లాడారని మంత్రి చెప్పారు. మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. రాయలసీమ లిఫ్ట్ విషయంలో తప్పంతా వైసీపీదే అని ఆరోపించారు. ప్రాజెక్టును ఆపి తప్పు చేసింది ఎవరో వైసీపీ నేతలు తెలుసుకోవాలన్నారు. సభా సాక్షిగా రాయలసీమకు జగన్ సర్కారు ఏమీ చేయలేదని వైసీపీ సభ్యులు నిరూపించారని చెప్పారు. 'జగన్‌తో మాట్లాడి రాయలసీమ లిఫ్ట్‌పై తామే స్టే తెచ్చామని ఆనాటి ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హరీశ్ రావు స్పష్టంగా చెప్పారు. ఈ విషయాన్ని తెలంగాణ శాసనసభ వేదికగా హరీశ్ రావు తెలిపారు' అని మంత్రి గుర్తుచేశారు. చేతకాని వైసీపీ దద్దమ్మ ప్రభుత్వం రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టిందని విమర్శించారు. ప్రాజెక్టు ఆపితే... చేతకాకుండా కోర్టుకు వెళ్లి అఫిడవిట్ వేస్తే దానికి తాము సమాధానం చెప్పాలా అంటూ మంత్రి పయ్యావుల కేశవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వైసీపీ.. వాకౌట్ అండ్ టాకౌట్ పార్టీ

## రాయలసీమపై నిజస్వరూపం బట్టబయలు

## మంత్రి పయ్యావుల కేశవ్ విమర్శలు



**అమరావతి,ఫిబ్రవరి26:** వైసీపీ.. వాకౌట్ అండ్ టాకౌట్ పార్టీగా మారిందని ఏపీ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు. జగన్ అండ్ కో నిజస్వరూపం ఇప్పుడు రాయలసీమ ప్రజలందరికీ తెలిసిపోయిందన్నారు. సభలో రాయలసీమ ఎత్తిపోతల విషయంలో ప్రశ్నవేసి.. చివరకు వైసీపీనే ఇరకాటంలో పడిందని సెటైర్లు గుప్పించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడారు. వైసీపీ నేతలు అనుకున్నది తాము చెప్పాలంటే ఎలా చెబుతామని ప్రశ్నించారు. వారు అడిగిన అన్ని అంశాలనూ తాము చర్చకు పెట్టామని స్పష్టం చేశారు. లా అండ్ ఆర్డర్, అగ్రికల్చర్ వంటి అన్నిఅంశాలపై చర్చ పెట్టామని తేల్చిచెప్పారు. టీటీడీ లడ్డూ అంశంపై వాస్తావాలు తెలియజేయాలని.. ప్రతిపక్షం లేకపోవడంతో.. ధూళిపాళ నరేంద్ర లేఖ రాశారని మంత్రి పయ్యావుల కేశవ్ ప్రస్తావించారు. సభ నిబంధనలు, సాంప్రదాయాలు తాము పాటిస్తున్నామని స్పష్టం చేశారు. తిరుపతి లడ్డూలో కల్తీ నెయ్యి వాడకంపై వైసీపీ కనీసం నోటీసు ఇవ్వలేదని ఆగ్రహించారు. సభలో రచ్చ చేయాలనేదే వాళ్ల ఉద్దేశం అని.. చర్చ జరగాలని కాదని విమర్శించారు. ప్రభుత్వం ముందుకు వచ్చి స్టేట్‌మెంట్ ఇస్తున్నామని చెప్పినా.. వారు ఎందుకు పారిపోతున్నారని దెప్పిపొడిచారు. తమ ప్రభుత్వం వారికన్నా ముందుగానే వచ్చి స్టేట్‌మెంట్ ఇస్తామని చెబుతోందని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. రేపు (శుక్రవారం) అగ్రికల్చర్ మీద చర్చ చేస్తామని తెలిపారు. వచ్చే నెల 4వ తేదీన లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంలో చర్చ చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటలు వరకూ కూడా కల్తీ నెయ్యిపై చర్చకు సిద్ధమని ఈరోజే చెప్పామని ప్రస్తావించారు. వైసీపీ నేడు ఆత్మరక్షణలో పడిందని విమర్శించారు. రాయలసీమ ఎత్తిపోతల విషయంలో ప్రశ్న వేసి భంగపడిందని మంత్రి పయ్యావుల కేశవ్ ఎద్దేవా చేశారు.

# ఘనంగా గోదావరి పుష్కరాల నిర్వహణ

## మహా కుంభమేలా తరహాలో గోదావరి పుష్కరాలు

## ఎపి కేబినేట్ సబ్ కమిటీలో నిర్ణయం

**అమరావతి,ఫిబ్రవరి 26:** 2027 జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు జరిగే గోదావరి పుష్కరాలను 6 జిల్లాలో ఘనంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అధ్యక్షతన 2027 గోదావరి పుష్కరాలపై క్యాబినెట్ సబ్ కమిటీ గురువారం సచివాలయంలో భేటీ అయింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులు చర్చించారు. ఈ సమావేశానికి మంత్రులు కందుల దుర్గేశ్, బీసీ జనార్ధన్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, గొట్టిపాటి రవి కుమార్, మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐదు అంశాలపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించారు. గత భేటీలోని అంశాలు, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఆయా శాఖలు రూపొందించిన పీపీటీలు, మంత్రుల సలహాలు, సూచనలు తదితర అంశాలపై చర్చించింది. మహా కుంభమేలా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహించాలని క్యాబినెట్ సబ్ కమిటీ భావించింది. 8 నుంచి 10 కోట్ల మంది ఈ పుష్కరాలకు వస్తారని క్యాబినెట్ సబ్ కమిటీ అంచనా వేస్తోంది. 4516 మీటర్ల మేర 373 ఘాట్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలకు అంచనా వేసింది. గతంలో ఉన్న 234 ఘాట్ల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టింది. పుష్కరాల ప్రధాన రోజుల్లో దాదాపు కోటి మంది వస్తారని అంచనా వేసింది. పవిత్ర స్నానానికి 2.25 కోట్ల మంది వస్తారని అంచనా వేసింది. భక్తుల సౌకర్యార్థం పిండ ప్రదానం ఘాట్లు, శానిటేషన్ ప్రక్రియ, రోడ్లు, వాటర్ తదితర విషయాల్లో పక్కా ప్రణాళిక ఉండాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయం తీసుకుంది. సాధారణ ధరలకే టెంట్ సిటీలు, హోమ్ స్టేలు ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్‌తో క్యాబినెట్ సభ కమిటీ చర్చించింది. ఈస్ట్ గోదావరిలో 102 ఘాట్లు, వెస్ట్ గోదావరి 40, కోనసీమ 175, ఏలూరు 36, కాకినాడ 5, పోలవరం జిల్లాలో 11 ఘాట్లు.. మొత్తంగా 369 ఘాట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఏపీలో మొదటి గోదావరి పుష్కర ఘాట్ పోలవరం జిల్లాలో గుండాల, చివరి ఘాట్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది, బలుసుతిప్ప, కాకినాడలో గోవలంక ఘాట్, వెస్ట్ గోదావరిలో నర్సాపురం ఘాట్ అని కమిటీ వెల్లడించింది. భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని నిర్ణయం తీసుకుంది. శాఖల మధ్య సమన్వయం కోసం ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్లను నియమించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది.

# మండలిలో మంత్రులను అడ్డుకున్న వైసిపి

## బొత్స తీరుపై మండిపడ్డ చీఫ్‌విప్ అనూరాధ



**అమరావతి,ఫిబ్రవరి 26 :** వైసీపీ నేతలపై శాసనమండలి చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కౌన్సిల్‌లో వైసీపీ సభ్యులు అనేక నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం సమాధానం చెబుతుంటే అడ్డుకుంటున్నారన్నారు. బడ్జెట్ సెషన్ అంతా గాలికి వదిలేసి చర్చ జరగకుండా చేశారని విమర్శించారు. ప్రశ్నోత్తరాలు కూడా జరగకుండా అడ్డుకున్నారని అనురాధ అన్నారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను సమాధానం ఇవ్వనీయకుండా నియంతలా ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్వల్పకాలిక చర్చను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రారంభించాల్సి ఉందని.. మంత్రి స్టేట్‌మెంట్ ఇవ్వడానికి వీలు లేదని.. ముందు తామే మాట్లాడతామని వైసీపీ నేతలు పట్టుబట్టారని తెలిపారు. ఇది ప్రజాస్వామ్యం అనుకుంటున్నారా రాజారెడ్డి రాజ్యాంగం అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. వైసీపీ సభ్యుల ఆందోళనలతో మండలి ఛైర్మన్ సభను రేపటికి(శుక్రవారం) వాయిదా వేశారని తెలిపారు. ప్రశ్నోత్తరాలు జరపమని ఛైర్మన్‌ను అడిగితే వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ సహా మరికొందరు మీదకు వస్తున్నారన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు మీదకు వైసీపీ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ వస్తుంటే మంత్రులు వెళ్ళి అడ్డుకున్నారని అనురాధ పేర్కొన్నారు.

# మహబూబాబాద్ జిల్లా నూతన కలెక్టర్ గా స్నేహ శబరిష్



భార్యాభర్తలు ఒకే జిల్లాలో గతంలో ములుగు జిల్లా ఎస్ పి గా పనిచేసి మహబూబాబాద్ ఎస్ పి గా పని చేసిన ఆమె భర్త శబరీష్ ఐ పి ఎస్ స్నేహ శబరీష్ కలెక్టర్ గా రావడం చరిత్రలో నిలిచి పోతారూ.జిల్లా ప్రధాన పోస్టులు భార్య భర్తలు పని చేయడం రికార్డు.గతంలో అజయ్ మిశ్రా కలెక్టర్ గా ఉన్న సందర్భంలో వరంగల్ కమీషనర్ గా షాలిని మిశ్రా, అరవింద్ కుమార్ మునిపల్ కమీషనర్ గా పని.చేసి అతని భార్య సుమిత్ర దావ్రా డి ఆర్ డి ఏ పీడీ గా పని చేశారు.

## మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ తో ప్రో,, కోదండరాం ,తెలంగాణ ఉద్యమకారుల సమావేశం..

**హైదరాబాద్ ఫిబ్రవరి26( సమయం న్యూస్):** మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో తెలంగాణ ఉద్యమకారుల సమావేశం..ప్రజా పాలన ప్రభుత్వంలో తెలంగాణ ఉద్యమకారుల హామీలు నెరవేర్చడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్న మంత్రి పొన్నం ప్రభాకర్..తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడానికి త్వరలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేయనుందన్న మంత్రి పొన్నం ప్రభాకర్..కమిటీకి సంబంధించిన విధి విధానాలు ఉద్యమకారుల హామీలు తదితర అంశాలపై మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రొ,, కోదండరాం ఉద్యమకారుల చర్చ

## పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై ప్రేరణాత్మక శిక్షణ కార్యక్రమం



**హైదరాబాద్, ఫిబ్రవరి 26 (సమయం న్యూస్):** అబిడ్స్‌లోని స్టాన్లీ గర్ల్స్ హైస్కూల్ ఆడిటోరియంలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సంకల్ప్ ఫౌండేషన్ సహకారంతో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై ప్రేరణాత్మక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తుకు పునాది వంటివని, ఎలాంటి భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. ప్రతిరోజూ టైమ్‌టేబుల్ ప్రకారం చదవడం, పాఠ్యాంశాలను పునరావృతం (రివిజన్) చేయడం, పాత ప్రశ్నపత్రాలను సాధన చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. మొబైల్ ఫోన్, టెలివిజన్ వంటి దృష్టి మళ్లించే అంశాల నుండి దూరంగా ఉండాలని, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, సరైన నిద్ర మరియు సమతుల్య ఆహారం తీసుకోవడం కూడా అత్యంత ముఖ్యమని మంత్రి సూచించారు. కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవడం సాధ్యమని, విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## సీబీఐ సమన్వయంతో యూఏఈ నుంచి రెడ్ నోటిస్ నిందితుడి రప్పింపు



**న్యూఢిల్లీ ఫిబ్రవరి 26( సమయం న్యూస్).:** Úentral Bureau of Investigation (సీబీఐ) సమన్వయంతో రెడ్ నోటీస్‌కు గురైన నిందితుడు అనిల్ కుమార్ రెడ్డి యెద్దులాను యూఏఈ నుంచి విజయవంతంగా భారత్‌కు రప్పించారు. ఈ ప్రక్రియను INTERPOL ఛాన ళ్ల ద్వారా పూర్తి చేశారు. అనిల్ కుమార్ రెడ్డి యెద్దు లా, ఆంధ్రప్రదేశ్ పోలీసులకు కావాల్సిన నిందితు డు. అతనిపై మోసం నమ్మకద్రోహం బెదిరింపు లుకేసులు నమోదు అయ్యాయి. సీబీఐ మరియు అంతర్జాతీయ పోలీసు సంస్థల సమన్వయంతో నిందితుడిని దేశానికి తీసుకురావడం జరిగింది. ప్రస్తుతం అతడిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం సంబంధిత అధికారులకు అప్పగించారు.

## గాంధీ ఐవీఎఫ్ సెంటర్‌లో ఐవీఎఫ్ చేయించుకున్న తొలి మహిళ, ఇటీవలే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది



**హైదరాబాద్ ఫిబ్రవరి26( సమయం న్యూస్).:** రాష్ట్రంలో ప్రభుత్వ ఐవీఎఫ్ సేవల ద్వారా జన్మించిన తొలి శిశువుగా, పాప పుట్టుకతోనే కొత్త రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గాంధీ హాస్పిటల్ ఐవీఎఫ్ సెంటర్‌లో పనిచేస్తున్న డాక్టర్లు, సిబ్బందిని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందించారు. ఐవీఎఫ్ సెంటర్ హెడ్, డాక్టర్ శోభ, ప్రోగ్రామ్ ఆఫీసర్, డాక్టర్ సుమిత్ర నాయర్, ఐవీఎఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ ఫాతిమా రాణి, ఎంబ్రయాలజిస్ట్ శివకృష్ణ, నర్సింగ్ ఆఫీసర్ పద్మావతి తదితరులను మంత్రి ఘనంగా సత్కరించి, వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.

# తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అరెస్టుల పర్వం నడుస్తోంది

...మాజీ మంత్రి ,ఎమ్మెల్యే గంగుల కమలాకర్....

..తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అరెస్టుల పర్వం నడుస్తోంది

...అభివృద్ధిని మరచి అక్రమ కేసుల పై దృష్టి పెడుతున్నారు

..ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ఇబ్బందులు పెడుతున్నారు

...బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను దోషులుగా చూస్తున్నారులి

..పాడి కౌశిక్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యేగా వీణవంక సమ్మక్క సారక్క జాతర లో ప్రోటోకాల్ అడిగారు

..ప్రోటోకాల్ ఉల్లంఘించడమే కాక పాడి కౌశిక్ రెడ్డిపై పోలీసులు నిరాధార ఆరోపణలు చేశారు

..సీపీ మత మార్పిడులకు పాల్పడుతున్నారని పాడి కౌశిక్ రెడ్డి ఎక్కడా అనలేదు

...ఐపీఎస్ అధికారుల సంఘం చేసిన స్టేట్మెంట్ ను అపుడే కౌశిక్ రెడ్డి ఖండించారు

..ఈ కేసును సీఐడీకి ఎందుకు ఇస్తున్నారు

...ఈ కేసులో స్కాం ఉందా ?దొంగతనం చేశారా ?తవ్వి తీసేందుకు ఏముంది ?

.మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను ఎందుకు కస్టడీ కావాలని ఎందుకు అడుగుతున్నారు

...సిఐడి విచారణ పారదర్శకంగా జరగాలి

...ఎవరి మీద పాడి కౌశిక్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారో వారితో కలిసి సీఐడీ విచారణ చేస్తే న్యాయం ఎలా జరుగుతోంది

...డీజీపీ ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించవద్దు

....ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ...

...వీణవంక నేను పుట్టి పెరిగిన గ్రామంలి

...తాత,ముత్తాతల నుంచి సమ్మక్క,సారక్క జాతర అక్కడ మేము దానం చేసిన స్థలం లో జరుగుతోంది

...సమ్మక్క గద్దెలను నా స్వంత డబ్బులు 30 లక్షల రూపాయలతో అభివృద్ధి చేశాను

...హుజురాబాద్ ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ నుంచి నేను వీణవంకకు వెళ్తుంటే నన్ను ఎందుకు అడ్డుకున్నారు

..మా తల్లిదండ్రులను హౌస్ అరెస్టు చేశారు

...మేము నలుగురం మాత్రమే సమ్మక్క గద్దెల వద్దకు వెళ్ళాము

...నా మైనర్ బిడ్డను పోలీసులు గుంజుకుని వెళ్లారులి

...రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు కరీంనగర్ సీపీ నన్ను ఇబ్బందులు పెట్టారు

..:నేను ముస్లింలను తిట్టానని కాంగ్రెస్ వాళ్లు నాపైన అసత్య ప్రచారం చేస్తున్నారు

...ఐపీఎస్ ఆఫీసర్లు ఇబ్బందులు పడే విధంగా పోలీసులు వ్యవహరించారు

...నన్ను అడ్డుకున్న పోలీసులను సస్పెండ్ చేయాలి.లేదా నాకు క్షమాపణ చెప్పాలో

...నేను కరీంనగర్ సీపీ మత మార్పిడులకు పాల్పడుతున్నారని అన్నానని నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి రాజకీయాల నుంచి తప్పుకుంటా

...ఈ కేసును సిఐడికి ఇస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు

...నన్ను ఇబ్బందులు పెట్టిన పోలీసులను పిలిచి సీఐడీ వాళ్ళు విచారణ చేశారు

...నేను 50 మందితో వెళ్లినట్లు నిరూపిస్తే నేను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తాను

...సిఐడిని పోలీసులు తప్పుదోవ పట్టిస్తున్నారులి

...అక్కడ ఉన్న సీసీ టీవీ ఫుటేజ్ ను బయటకు తీయాలి

...పోలీసులతో కుమ్మక్కు అయ్యి సిఐడి విచారణ చేస్తున్నారు

...రేవంత్ రెడ్డి స్క్రిప్ట్ ఏం ఇస్తే అదే చేస్తారా...?లి

...కరీంనగర్ సీపీ,హుజూరాబాద్ సీపీ చేసిన తప్పులకు వంద తప్పులు పోలీసు శాఖ చేస్తోందిలి

..వచ్చే మూడు ఏళ్ళల్లో బిఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది

..ఎవరిని విడిచిపెట్టేది లేదు

...కరీంనగర్ సీపీ,హుజూరాబాద్ ఏసీపీ,జమ్మికుంట సిఐను సస్పెండ్ చేసే వరకు పోరాటం చేస్తాను

...హుజురాబాద్ నియోజకవర్గంలో పోలీసులు ఏజెంట్లను పెట్టుకుని వసూళ్లు చేస్తున్నారు.త్వరలో ఆధారాలతో బయటపెడతానులి

...ల్యాండ్ ఎండోమెంట్ కు సంబంధించినది అని ఎమ్మార్వో రిపోర్ట్ ఇచ్చినందుకు వెంటనే ఆయన్ను ట్రాన్స్ఫర్ చేశారు

...ప్రభుత్వ భూములను కాపాడుకునే ఉదేశ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా...?

...నా నియోజకవర్గంలో జమ్మికుంట మున్సిపాలిటీకి ముస్లింని వైస్ ఛైర్మన్ చేశాము

...హుజురాబాద్ మున్సిపాలిటీలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఖలీద్ కు ఎందుకు వైస్ ఛైర్మన్ కాంగ్రెస్ పార్టీ ఇవ్వలేదు

...జమ్మికుంట ఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలిలి

...వీణవంకలో సమ్మక్క,సారక్క గద్దెల వద్ద భక్తులపై లాఠీ ఛార్జ్ ఎందుకు చేశారు

...భక్తులను ఎందుకు కొట్టారో పోలీసులు సమాధానం చెప్పాలిలి

...వీణవంక మండలంలో ఉన్న ప్రజలను సీఐడీ విచారణకు పిలిస్తే నిజం ఏమిటో తెలుస్తుంది

...సమ్మక్క జాతర ఒక వ్యక్తి కోసం నిర్వహిస్తున్నారా లేక ప్రజల కోసం నిర్వహిస్తున్నారా...?లి

...సమ్మక్క గద్దెలు ఉన్న 4 ఎకరాల 16 గుంటల్లో 50 శాతం వాళ్ళది,50 శాతం మాదిలి

...మేము ఎప్పుడో ఎండోమెంట్ కు రాసి ఇచ్చాము

...హుండీలో వచ్చిన భక్తుల డబ్బులు ఎత్తుకుపోవడానికి ప్రయత్నం చేశారు

...రాజకీయాలకు పోలీసులు బలి కావద్దని కోరుతున్నాలి

...డీజీపీ వెంటనే ముగ్గురు పోలీస్ అధికారులను సస్పెండ్ చేయాలి

# జగ్గారెడ్డి వ్యాఖ్యలు - రాజ్యసభ స్థానాలపై కాంగ్రెస్‌లో చర్చలు



**హైదరాబాద్ ఫిబ్రవరి26( సమయం న్యూస్). :** తెలంగాణలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాల విషయంలో కాంగ్రెస్ పార్టీ లోపల చర్చలు జరుగుతున్నాయని కాంగ్రెస్ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ఇన్‌చార్జ్ నటరాజ్‌తో ఇప్పటికే చర్చించినట్లు చెప్పారు. రాజ్యసభకు వి హనుమంతరావు మరియు జెట్టి కుసుమ కుమార్ పేర్లను పరిశీలించాలని తాను సూచించినట్లు వెల్లడించారు. ఈ విషయంపై చర్చించేందుకు ఢిల్లీకి వెళ్లి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలను కలిసేందుకు ప్రయత్నించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీ ముందస్తు కార్యక్రమాలతో బిజీగా ఉండటంతో ఆయనను కలవలేకపోయానని, అయితే మల్లికార్జున ఖర్గేను కలిసి హనుమంతరావు, జెట్టి కుసుమ కుమార్‌లకు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఈ ప్రతిపాదనపై కమిటీ స్థాయిలో చర్చిస్తామని ఖర్గే హామీ ఇచ్చారని చెప్పారు. జెట్టి కుసుమ కుమార్ యువజన కాంగ్రెస్, విద్యార్థి నాయకుడిగా ఎదిగిన వ్యక్తి అని, కమ్మ సామాజిక వర్గానికి చెందిన నాయకుడిగా ఆయనకు అవకాశం ఇవ్వాలని కోరినట్లు పేర్కొన్నారు. ఆయన కుటుంబం స్వాతంత్ర్య సమరయోధుల నేపథ్యం కలిగి, తరతరాలుగా కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతున్నదని తెలిపారు. అలాగే వి హనుమంతరావు అనేక ముఖ్యమంత్రులతో పని చేసి, మూడు సార్లు రాజ్యసభ సభ్యుడిగా సేవలందించిన సీనియర్ నాయకుడని అన్నారు. రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ ఆయనకు గతంలో అవకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు. వయస్సులో పెద్దవారైనా చురుకైన నాయకుడిగా ఉన్నందున మరోసారి అవకాశం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. చివరగా, పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని, ముఖ్యంగా రాహుల్ గాంధీ తీసుకునే నిర్ణయాన్ని గౌరవిస్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

# ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ప్రశాంతం

**● హాజరు శాతం 98.03% నమోదు**

**సంగారెడ్డి, ఫిబ్రవరి 26( సమయం న్యూస్).:** జిల్లాలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం ద్వితీయ సంవత్సరం తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృత భాషా పేపర్ల పరీక్షలు ప్రశాంతంగా, సజావుగా జరిగాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి గోవింద్ రామ్ తెలిపారు. మొత్తం 15,515 మంది విద్యార్థులకు గాను 15,209 మంది విద్యార్థులు హాజరయ్యారు. వీరిలో జనరల్ కోర్సుకు చెందిన 14,296 మంది, వృత్తి (వొకేషనల్) కోర్సుకు చెందిన 913 మంది విద్యార్థులు హాజరైనారని తెలిపారు. మొత్తం 306 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని, అందులో జనరల్ కోర్సుకు చెందిన 259 మంది, వృత్తి కోర్సుకు చెందిన 47 మంది విద్యార్థులు ఉన్నారని పేర్కొన్నారు. మొత్తం హాజరు శాతం 98.03% నమోదైందనీ,ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఆయన తెలిపారు. పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు కన్వీనర్/డీఐఈఓ 2 పరీక్ష కేంద్రాలను, డీఈసీ సభ్యులు 11 కేంద్రాలను, హెచ్‌పీసీ సభ్యులు 5 కేంద్రాలను, ఫ్లయింగ్ స్క్వాడ్లు 14 కేంద్రాలను, సిట్టింగ్ స్క్వాడ్లు 8 కేంద్రాలను తనిఖీ చేసినట్లు గోవింద్ రామ్ తెలిపారు.

## బాల్య వివాహాల నిర్మూల అభయ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా ఇంచార్జి మంత్రి



**అదిలాబాద్ ఫిబ్రవరి26( సమయం న్యూస్).:** ప్రాజెక్టు సందర్శన అనంతరం, బాల్య వివాహాల నిర్మూలనే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం చేపట్టిన “అభయ” కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. “చిన్నారి బాల్యాన్ని కాపాడుకుందాం -- బాల్య వివాహాలను నిలుపుదల చేద్దాం” అనే నినాదంతో రూపొందించిన ఈ కార్యక్రమం ద్వారా బాల్య వివాహ నిరోధక చట్టం--2006పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా చట్టానికి సంబంధించిన వివరాలు, అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్లు (1098, 112, 100) పొందుపరిచిన ప్రత్యేక పోస్టర్లను మంత్రి ఆవిష్కరించారు. బాల్య వివాహాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సలహాదారులు వేమ నరేందర్ రెడ్డి, పి. సుదర్శన్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్ పర్సన్ అనూష, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషరావ్ రాథోడ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్క్, ఆర్డీఓ స్రవంతి, తహసిల్దార్లు శ్రీనివాస్, రాజేశ్వరి, నలందప్రియ తదితరులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# హత్తిఘాట్ పంపుహౌడ్, ఛానాక కోరాట బ్యారేజ్ పనుల ఏరియల్ సర్వే పరిశీలన.





**అదిలాబాద్ ఫిబ్రవరి26( సమయం న్యూస్). :** రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు. హైదరాబాద్ నుండి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరిన మంత్రి, జిల్లాలోని భీంపూర్, బోరజ్ మండలాల పరిధిలో గల హట్టిఘాట్ పంప్ హౌస్, చనాకా-కోరాట బ్యారేజ్ ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అనంతరం హట్టిఘాట్ పంప్ హౌస్ వద్ద క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రాజెక్టు పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. చనాకా-కోరాట బ్యారేజ్ ద్వారా చేకూరే సాగునీటి ప్రయోజనాలపై ఇంజనీరింగ్ అధికారులతో సమగ్రంగా చర్చించి పలు సూచనలు చేశారు. ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచి నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర వివరాలు, జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని మంత్రికి వివరించారు. ఈ పర్యటనలో రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, పి. సుదర్శన్ రెడ్డి, టీజీఐఐసీ ఎండీ కె. శశాంక, ఆదిలాబాద్ ఎంపీ జి. నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎస్పీ అఖిల్ అఖిల్మ మహాజన్, అదనపు కలెక్టర్లు శ్యామలాదేవి, రాజేశ్వర్, విద్యుత్ శాఖ ఎస్ ఈ శేషరావ్ రాథోడ్, ఆర్డీఓ స్రవంతి, తహసిల్దార్లు శ్రీనివాస్, రాజేశ్వరి, నలందప్రియ, వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై జోగులాంబ గద్వాల్ జిల్లాకి వెళ్తున్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

- జనగామ జిల్లా పేరును జాతీయ స్థాయికి తీసుకెళ్లిన కలెక్టర్
- జిల్లా అభివృద్ధిలో తనదైన మార్క్
- విద్య, వైద్యం మీద ప్రత్యేక దృష్టి
- నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు నిరంతరం తపన



**జనగాం ఫిబ్రవరి26( సమయం న్యూస్).:** జనగామ జిల్లా కలెక్టర్ గా రిజ్వాన్ బాషా షేక్ రెండేళ్లు పూర్తి చేసుకొని. .జోగులాంబ గద్వాల జిల్లాకు బదిలీ అయిన సందర్భం గా.. జనగామ జిల్లాలో సంక్షేమ పథకాల అమలులో కలెక్టర్ అందించిన విశేష సేవలు, అందుకున్న పురస్కారాలు

"మన జిల్లా – మన నీరు" అనే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వివిధ శాఖల అధికారుల భాగస్వామ్యంతో ఇంకుడు గుంతల నిర్మాణాలు చేశారు. ఈ క్రమంలో నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణలో భాగంగా 2025, నవంబర్ 18న ఢిల్లీలో జరిగిన 6వ జాతీయ జల అవార్డుల కార్యక్రమంలో కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీ. ఆర్. పాటిల్ నుంచి ఢిల్లీలో జల్ సంచాయ్ – జన్ భాగీధారీ 1.0 అవార్డు, అలాగే జల్ ప్రహరీ సమ్మాన్ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు.అదే విధంగా సమాచార హక్కు చట్టం దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించి, అమలులో ప్రతిభ చూపినందుకు గాను 2025, అక్టోబర్ 9న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా అవార్డును పొందారు.అలాగే ఎన్నికల ప్రక్రియలో కీలక పాత్ర వహించే ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, పోలింగ్ సిబ్బంది, పరిశీలకులకు, ఎన్నికల నిబంధనలు, విధివిధా నాలపై స్పష్టమైన అవగాహన కల్పించి, సిబ్బంది నైపుణ్యాలను పెంపొందించడం ద్వారా ఎన్నికల నిర్వహణను అధికారులు సక్రమంగా, పారదర్శకంగా నిర్వహించినందుకు గాను 16వ జాతీయ ఓటర్ల దినత్సవాన్ని పురస్కరించుకొని 2026, జనవరి 25న హైదరాబాదులోని రవీంద్ర భారతిలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా ఉత్తమ జిల్లాగా పురస్కారాన్ని పొందారు.అదే విధంగా జాతీయ స్థాయి పీూరా – 2024లో తృతీయ తరగతిలో 16వ స్థానం, ఆరవ తరగతిలో 35వ స్థానం, 9వ తరగతిలో 33వ స్థానం సాధించి, దేశవ్యాప్తంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో కేవలం జనగామ జిల్లా విశిష్ట స్థానం సంపాదించినందుకు గాను 2025, సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను జిల్లాలోని నిరుపేదలకు అందించేందుకు... నిరంతరం పర్యటనలు, సమీక్ష లతో....జనగాం జిల్లా ను రాష్ట్ర, జాతీయ స్థాయి లో వివిధ అంశాల్లో ముందంజ లో నిలబడేలా చేసిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి ప్రజాప్రతినిధులు, అధికారులు ధన్యవాదములు తెలిపారు జిల్లా అభివృద్ధిలో భాగస్వామ్యం అయిన ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కి అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు.

# మహబూబాబాద్‌లో పిఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ఒక రోజు అవగాహన సదస్సు




**మహబూబాబాద్, ఫిబ్రవరి 26,,( సమయం న్యూస్).:** స్థానిక కురవి రోడ్డులోని శ్రీ వీరభద్ర క్రేజీ ఫుడ్ వరల్డ్ వేదికగా మీూవీజు–ఐఖీూ హైదరాబాద్ మరియు జిల్లా పరిశ్రమల కేంద్రం మహబూబాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో 'పిఎం విశ్వకర్మ' లబ్ధిదారులకు మరియు దరఖాస్తుదారులకు ఒక రోజు అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ శ్రీమన్నారాయణ రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ దినేష్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ యాదగిరి, మరియు బీసీ కార్పొరేషన్ అధికారి శ్రీనివాస రావు, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ హాజరయ్యారు.

**సదస్సులోని ముఖ్యాంశాలు:** డిజిటల్ మార్కెటింగ్: మారుతున్న కాలానికి అనుగుణంగా తమ ఉత్పత్తులను ఆన్‌లైన్ వేదికల ద్వారా ఎలా విక్రయించాలో లబ్ధిదారులకు వివరించారు. ప్యాకేజింగ్: వస్తువుల నాణ్యతతో పాటు ఆకర్షణీయమైన ప్యాకేజింగ్ ప్రాముఖ్యతను మరియు మార్కెట్‌లో దానికి ఉన్న డిమాండ్‌ను నిపుణులు వివరించారు. ప్రభుత్వ పథకాలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేతివృత్తుల వారికి అందిస్తున్న వివిధ రకాల రాయితీలు, లోన్ సదుపాయాలు మరియు ఇతర అభివృద్ధి పథకాలపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిఎం శ్రీమన్నారాయణ రెడ్డి మాట్లాడుతూ, పిఎం విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తుల వారు ఆర్థికంగా ఎదగడానికి గొప్ప అవకాశం ఉందని, సాంకేతికతను జోడించి తమ వ్యాపారాలను విస్తరించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ మండలాల నుండి వచ్చిన విశ్వకర్మ లబ్ధిదారులు దరఖాస్తుదారులు మరియు అధికారులు పాల్గొన్నారు.



# పోలీస్ దర్బార్ నిర్వహించిన: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS

- పోలీస్ శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది

**మరియు హోం గార్డుల పాత్ర అత్యంత కీలకం- ఎస్పీ**

**నారాయణపేట,ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పోలీసు హెడ్ క్వాటర్స్ లోని ఆర్మ్డ్ రిజర్వ్ (ఏ.ఆర్) పోలీసు సిబ్బంది మరియు హోం గార్డులతో ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పోలీస్ దర్బార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తమ సర్వీస్ కు సంబంధించి సమస్యలు, హెడ్ క్వాటర్స్ లో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు, వీక్లీ ఆఫ్, పెండింగ్ బిల్లులు తదితర సమస్యలు, సూచనలు, రోజువారి విధి నిర్వహణ అంశాలను స్వయంగా విన్న ఎస్పీ, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... పోలీసు శాఖలో ఆర్మ్డ్ రిజర్వ్ సిబ్బంది మరియు హోం గార్డుల పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తు విధులు, ప్రత్యేక ఆపరేషన్లు, పండుగలు మరియు ఎన్నికల సమయంలో వీరి సేవలు అత్యంత ప్రధానమని అన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో, నిబద్ధతతో విధులు నిర్వర్తించి పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచాలని సూచించారు. సిబ్బంది సంక్షేమం పట్ల జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు, వసతి, డ్యూటీ సమయాల వంటి అంశాలను అధికారులకు నేరుగా తెలియజేయాలని ఎస్పీ తెలిపారు. సమస్యలు పెండింగ్‌లో ఉండకుండా దశలవారీగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, ప్రతి ఒక్కరూ శారీరక దారుఢ్యాన్ని పెంపొందించుకోవాలని, రోజువారీ వ్యాయామం చేయాలని, ఒత్తిడిని అధిగమించేందుకు మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని, అలాగే తమ తల్లిదండ్రులను ఫ్యామిలీని బాగా చూసుకోవాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించడం ద్వారా పోలీసు శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. హోం గార్డులు కూడా పోలీసు కుటుంబంలో భాగమేనని, వారి సేవలు అమూల్యమని ఎస్పీ ప్రశంసించారు. క్రమశిక్షణ, సమయపాలన, విధి పట్ల నిబద్ధత ప్రతి ఒక్కరికీ తప్పనిసరి ఉండాలని స్పష్టం చేశారు. ఈ పోలీస్ దర్బార్ కార్యక్రమంలో ఆర్మ్డ్ రిజర్వ్ అదనపు ఎస్పీ వీణ రియాజ్ హుల్ హక్, ఆర్ఐలు నరసింహ, విజయ్ భాస్కర్, ఆఫీస్ సూపర్డెంట్ శంకర్ లాల్, ఆర్.ఎస్సై లు శ్వేత, కృష్ణ చైతన్య, శివన్న,ఏ.ఆర్.ఎస్సైలు లు, ఆర్మ్డ్ రిజర్వ్ పోలీసులు, మరియు హోమ్ గార్డ్ లు పాల్గొన్నారు.



# ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**నిజామాబాద్, ఫిబ్రవరి 26( సమయం న్యూస్)** బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. గురువారం ఇంటర్ సెకండియర్ పరీక్ష కొనసాగగా, విద్యార్థుల హాజరు గురించి కలెక్టర్ ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగానే పరీక్ష నిర్వహిస్తున్నారా? అని పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీటి వసతి, ప్రథమ చికిత్స సదుపాయం, ఏ.ఎన్.ఎం, టాయిలెట్స్ అందుబాటులో ఉన్నాయా అని గమనించారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సజావుగా పరీక్షలు జరిపించాలని సూచించారు. పరీక్ష పూర్తయిన వెంటనే ఆన్సర్ షీట్లు తగిన పోలీసు బందోబస్తు మధ్య నిర్దేశిత కేంద్రాలకు తరలించాలని, ఎలాంటి కాపీయింగ్ కు అవకాశం లేకుండా పూర్తి పారదర్శకంగా, పక్కాగా పరీక్షలు జరిపించాలని ఆదేశించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచీలు వంటి ఉపకరణాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించకూడదని సూచించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు.

# తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణం

**-- ఆసియా పారా గేమ్స్ 2026 భారత జట్టు ఎంపిక**

**కమిటీ సభ్యుడిగా శ్రీ సింగారపు బాబు నియామకం**



తెలంగాణ రాష్ట్రానికి మరో విశిష్ట గౌరవం దక్కింది. రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి గ్రామానికి చెందిన అంతర్జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ కోచ్ శ్రీ సింగారపు బాబు గారు 2026 ఆసియా పారా గేమ్స్ భారత జట్టు ఎంపిక కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. జపాన్‌లోని ఐచి-- నగోయాలో నిర్వహించనున్న 2026 ఆసియా పారా గేమ్స్ కోసం భారత జట్టును ఎంపిక చేసే సాంకేతిక పరిశీలకుడు మరియు ఎంపిక కమిటీ సభ్యుడిగా Paralympic Committee of India (PCI) ఆయనను అధికారికంగా నియమించింది. 2026 ఫిబ్రవరి 26 నుండి 28 వరకు నిర్వహించబడనున్న 14వ జాతీయ పారా సిట్టింగ్ వాలీబాల్ ఛాంపియన్షిప్ (పురుషులు & మహిళలు) సందర్భంగా ఆసియా పారా గేమ్స్‌కు భారత జట్టు ఎంపిక ప్రక్రియ చేపట్టబడుతుంది. ఈ సందర్భంగా జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించి, సమర్థమైన భారత జట్టును రూపొందించే బాధ్యతను ఎంపిక కమిటీకి అప్పగించారు. తెలంగాణ రాష్ట్రంలోని మారుమూల గ్రామం నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, దేశానికి సేవ చేయడం రాష్ట్ర క్రీడా రంగానికి గర్వకారణంగా నిలిచింది. శ్రీ సింగారపు బాబు గారి నియామకం రాష్ట్ర క్రీడాకారులకు మరియు యువతకు ప్రేరణగా నిలుస్తోంది. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియాకు శ్రీ సింగారపు బాబు గారు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు

# మెదక్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు చేపట్టిన ప్రతిమాసింగ్



స్వాగతం పలికిన అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులు నూతన కలెక్టర్ ను మర్యాదా పూర్వకంగా కలిసిన జిల్లా అధికారులు.

## భూ భారతిలో రెవెన్యూ సదస్సు అప్లికేషన్లు మాయం

**హైదరాబాద్ ఫిబ్రవరి26( సమయ్దం న్యూస్) :** సమాచారం ఇవ్వకుండా దరఖాస్తులు కాన్సిల్ చేయడంతో ఆఫీసుల చుట్టూ తిరుగుతున్న రైతులుతెలంగాణలో తమ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు భూ భారతిలో తాము చేసిన లక్షలాది దరఖాస్తులు కాన్సిల్ అవ్వడంతో అయోమయంలో రైతులు దాదాపు 6 లక్షల దరఖాస్తులు వస్తే కేవలం 60 వేల దరఖాస్తులు మాత్రమే పరిష్కరింపబడ్డాయని తెలుపుతున్న అధికారుల లెక్కలుఎటువంటి కారణం లేకుండా దరఖాస్తులు కాన్సిల్ చేయడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్న రైతులు, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఉచిత సలహాలు ఇస్తున్న అధికారులుసరైన కారణం తెలిపి దరఖాస్తులు తిరస్కరించకుండా, ఏకంగా భూ భారతి పోర్టల్ నుండి దరఖాస్తులు కాన్సిల్ చేయడం ఏంటని రైతుల అసహనంకొన్ని గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో స్వీకరించిన దరఖాస్తులు కనీసం పోర్టల్‌లో అప్లోడ్ కూడా చేయలేదని ఆరోపిస్తున్న రైతులు

## ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలి

- మెదక్ జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ ఫిబ్రవరి26( సమయం న్యూస్).:** ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. నూతన కలెక్టర్ కలెక్టరేట్ కు చేరుకోగానే జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ ఓ భుజంగ రావు,మెదక్ ఆర్డీవో రమాదేవి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. గురువారం మెదక్ జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యత చేపట్టిన కలెక్టర్ కు జిల్లా అధికారులు జిల్లా అధికారులు పూల మొక్కల తో స్వాగతం పలికి మర్యాదగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా నూతన కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అప్పగించిన బాధ్యతను నెరవేర్చుతూ ,ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానన్నారు. ఇంటర్, పదో తరగతి పరీక్షల గురించి డీఈఓ ను, ఇంటర్ విద్యార్థి గారిని అడిగి తెలుసుకున్నారు. ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పి సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ ఓ భుజంగరావు, జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

# ప్రజల చెంతకి పోలీసులు

- ఘటనపై వెంటనే స్పందించిన నారాయణపేట రూరల్ పోలీసులు
- బాధితునీతో మాట్లాడి వివరాలు సేకరించిన ఎస్సై రాముడు





**నారాయణపేట మండలం, ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోటకొండ గ్రామంలో చోటుచేసుకున్న అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి ఘటన స్థలంలోనే కేసు నమోదు చేశారు. కోటకొండ గ్రామానికి చెందిన మూడింట్ల కృష్ణ (తండ్రి: వెంకటప్ప)కు చెందిన TSOGUA 4941 నంబర్ గల ఆటోను రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టి కాల్చివేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ విషయం తెలిసిన వెంటనే రూరల్ ఎస్సై రాముడు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితుడితో మాట్లాడి వివరాలు సేకరించారు. బాధితుడి నుంచి పిటిషన్ స్వీకరించి, అక్కడికక్కడే కేసు నమోదు చేసి ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేయడం జరిగింది. ఘటనకు సంబంధించి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై రాముడు తెలిపారు. ఆటోకు నిప్పు పెట్టిన వ్యక్తులను త్వరలోనే గుర్తించి పట్టుకుని, వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల ఆస్తుల రక్షణకు పోలీసులు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని, ఏదైనా అనుమానాస్పద ఘటనలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం ఎంతో అవసరమని తెలిపారు.

సమయం

www.epaper.samayamdaily.net

# జనగామ జిల్లా నూతన కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝూ

- జనగామ జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝూ బాధ్యతల స్వీకరణ
- జనగామ జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న రిజ్వాన్ బాషా షేక్ బదిలీ అయ్యారు.



**జనగాం ఫిబ్రవరి26( సమయ్ధం న్యూస్).:** ఆయన స్థానంలో జీహెచ్ఎంసీ, కుత్బుల్లాపూర్, జోనల్ కమిషనర్ (2014 కేడర్ ఐఏఎస్ అధికారి) సందీప్ కుమార్ ఝూ నూతన కలెక్టర్‌గా నియమితులయ్యారు. జనగామ జిల్లా కలెక్టర్ గా సందీప్ కుమార్ ఝూ గురువారం మధ్యాహ్నం బాధ్యతలను స్వీకరించారు

# యాంకి గ్రామములో క్రికెట్ టోర్నమెంట్

- ముఖ్యఅతిథిగా పాల్గోని టోర్నమెంట్ ప్రారంభించిన సర్పంచ్.ఏ.మాణిక్యప్ప



**దౌల్తాబాద్ మండలం, ఫిబ్రవరి 26(సమయం న్యూస్ ) :** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండల పరిధిలో యాంకి గ్రామంలో గురువారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా గ్రామ సర్పంచ్ ఏ. మాణిక్యప్ప, రవీందర్ రెడ్డి, కోట్ల హన్మంతు,విష్ణువర్ధన్ రెడ్డి,శివ కుమార్, హాజ్మీర్, పీస్.అశోక్ కుమార్, మాల్ రెడ్డి, ఎస్.అశోక్ తదితరులు క్రికెట్ ను ప్రారంభించారు. వివిధ గ్రామాలనుండి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకకున్నారు. ముందుగా గ్రామ పెద్దలు క్రికెట్ అడి య-ువకులలో జోష్ నింపారు. ఇట్టి క్రికెట్ టోర్నమెంట్ గురువారం నుండి మార్చి 2 వరకు నిర్వహించడం జరుగుతుందని టోర్నమెంట్ నిర్వాహకులు పి.నిరంజన్ రెడ్డి, హాజరోద్దీన్, ఎం. భీమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ టోర్నమెంట్లో క్రికెట్ అభిమానులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఈ టోర్నమెంట్ చివరి రోజున అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించడం జరుగుతుందని అన్నారు.

# విద్యార్థులకు ఆరోగ్య--వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సు

- చెట్లపోతారం పాఠశాలలో హెటెరో యాజమాన్యం ప్రత్యేక కార్యక్రమం



**పటాన్ చెరు (జిన్నారం), ఫిబ్రవరి 26(సమయం న్యూస్):** గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చెట్లపోతారంలో విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణతో పాటు వ్యక్తిత్వ వికాసం లక్ష్యంగా హెటెరో యాజమాన్యం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య విద్య, పచ్చదనం--పరిశుభ్రత ప్రాముఖ్యత, సమాజంలో బాధ్యతాయుత జీవనం, జీవిత నైపుణ్యాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలికల వ్యక్తిగత పరిశుభ్రత, శారీరక మరియు మానసిక ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు వివరించారు. అదేవిధంగా "గుడ్ టచ్ -- బ్యాడ్ టచ్" అంశంపై స్పష్టమైన వివరణ అందిస్తూ, అనుచిత ప్రవర్తనను ఎలా గుర్తించాలి, అలాంటి పరిస్థితుల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా విశ్వసనీయ వ్యక్తులను ఎలా సంప్రదించాలనే విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. ఎలాంటి సమస్య వచ్చినా భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులకు ఉపయోగకరమైన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన హెటెరో యాజమాన్య ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆరోగ్య చైతన్యంతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించిందని వారు పేర్కొన్నారు.

# ఏడుపు ఆపలేదని... పసిబిడ్డను పొయ్యిలోకి విసిరేసిన కసాయి తల్లి!

- హైదరాబాద్ బౌరంపేటలో అమానుష ఘటన
- ఏడుస్తున్నాడని రెండు నెలల పసికందును పొయ్యిలో వేసిన తల్లి
- తండ్రి ఫిర్యాదుతో నిందితురాలైన తల్లిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలింపు

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మధ్యప్రదేశ్‌కు చెందిన రాజేంద్ర ఆదివాసి (21), మమత అహిర్వార్ (20) దంపతులు. బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి బౌరంపేటలోని ఓ నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో కార్మికులుగా పనిచేస్తూ, అక్కడే ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక షెడ్డులో నివసిస్తున్నారు. వీరికి రెండు నెలల కుమారుడు ఉన్నాడు. సోమవారం రాత్రి బాబు నిరంతరం ఏడుస్తుండటంతో తల్లి మమత తీవ్ర ఆగ్రహానికి గురైంది. ఏడుపు ఆపడానికి బాబు నోట్లో గుడ్డలు కుక్కి, కాళ్లు కట్టేసి, ఆపై మండుతున్న కట్టెల పొయ్యిలో పడేసి అత్యంత కిరాతకంగా హత్య చేసింది. పని ముగించుకుని వచ్చిన తండ్రి రాజేంద్ర.. బాబు కనిపించకపోవడంతో భార్యను ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు చెప్పింది. దీంతో అనుమానం వచ్చి చుట్టుపక్కల వెతకగా, పొయ్యిలో కాలిపోయిన స్థితిలో బాబు మృతదేహం కనిపించింది. భర్త ఫిర్యాదు మేరకు దుండిగల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నిందితురాలైన తల్లి మమతను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. పసికందు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

# సంక్షేమ అభివృద్ధి పథకాల అమలు పై 100 రోజుల ప్రణాళిక

**హైదరాబాద్, ఫిబ్రవరి 26:( సమయం న్యూస్) :** గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి గారి ఆదేశాల మేరకు రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి తోపాటు రాష్ట్ర మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొనే ఈ వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డా.బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో నేడు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని సి.ఎస్ నిర్వహించారు. స్పెషల్ సి.ఎస్ లు జయేష్ రంజన్, వికాస్ రాజ్ ,సి.వీ ఆనంద్ , సంజయ్ కుమార్ , మహేష్ దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు హాజరైన ఈ సమావేశంలో సి.ఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28వ తేదీన నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. అదేవిధంగా మార్చ్ 1వ తేదీ ఆదివారం నాడు జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 2వ తేదీ నుండి జూన్ 9 వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీ శాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను



సిద్ధం చేయాలని, జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చనీయాంశాలు వెంటనే రూపొందించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ముఖ్యమంత్రి తో పాటు రాష్ట్ర మంత్రులు ప్రారంభిస్తారని ఇందుకు గాను ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలనీ అన్నారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, హెల్త్, ఎడ్యుకేషన్, పంచాయితీ రాజ్, వ్యవసాయం, రెవెన్యూ, పర్యాటక, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, గృహనిర్మాణం, రెవెన్యూ, విద్యుత్, కార్మిక తదితర అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సి.ఎస్ పేర్కొన్నారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు అవగాహన చైతన్య కార్యక్రమాల మాదిరిగా కార్యక్రమాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సచివాలయం తోపాటు హెచ్.ఓ.డి లలో ఈ-ఆఫీస్ ను అమలు చేయాలని ఆదేశించారు.

# జిల్లా పరిశ్రమల కేంద్రం,ఈడీసీ టీమ్ ఆధ్వర్యంలో ఉద్యమ్ నమోదుపై అవగాహన

- ముఖ్య అతిథిగా పాల్గొన్న పరిశ్రమల శాఖ ఐపీవో నర్సింగ్ రావు

**నారాయణపేట, ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా పరిశ్రమల కేంద్రం ఈడీసీ టీమ్ ఆధ్వర్యంలో ఉద్యమ్ నమోదు (Udyam Registration) పై అవగాహన కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం Ministry of Micro, Small and Medium Enterprises, భారత ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నిర్వహించబడింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిశ్రమల శాఖ ఐపీవో నర్సింగ్ రావు హాజరయ్యారు. ప్రత్యేక అతిథులుగా లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్ కుమార్, ఈడీసీ మేనేజర్ పి. నవీన్ కుమార్ రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ నవీన్ కుమార్, పీఎంఎఫ్ఎంఈ డీఆర్‌పి యశ్వంత్, హ్యాండ్లూమ్స్ శాఖ క్లస్టర్ డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు మాట్లాడుతూ ఉద్యమ్ నమోదు అనేది సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (మీఎీజుం) కోసం అత్యంత అవసరమైన ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ అని వివరించారు. ఉద్యమ్ నమోదు ద్వారా లభించే ముఖ్య ప్రయోజనాలను తెలియజేశారు:



కొలాటరల్ ఫ్రీ రుణ సౌకర్యం

కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వ సబ్సిడీలు, ప్రోత్సాహకాలు

ప్రాధాన్య రుణాల కింద ఆర్థిక సహాయంచెల్లింపుల ఆలస్యంపై రక్షణప్రభుత్వ టెండర్లలో పాల్గొనే అవకాశం

వివిధ ఎంఎస్ఎంఈ పథకాల ప్రయోజనాలుఅలాగే ఉద్యమ్ నమోదు విధానం, అవసరమైన పత్రాలు మరియు నమోదు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలపై సవివరంగా అవగాహన కల్పించారు. పాల్గొన్న పారిశ్రామికవేత్తల సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. జిల్లాలోని పారిశ్రామిక వేత్తలు, స్వయం ఉపాధి ఆశావహులు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అన్ని అర్హులైన యూనిట్లు తమ ఉద్యమ్ నమోదు త్వరగా పూర్తి చేసుకోవాలని ఈడీసీ టీమ్ సూచించింది. జిల్లా పరిశ్రమల కేంద్రం, నారాయణపేట భవిష్యత్తులో కూడా పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్గదర్శకాలు మరియు సహాయం అందించనున్నట్లు తెలిపారు.



# గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ

**హైదరాబాద్ ఫిబ్రవరి26( సమయం న్యూస్) :** హైదరాబాదులో ఫిబ్రవరి16 నుండి 2 మార్చ్ వరకు నిర్వహిస్తున్నారు. గిరిజన సంక్షేమ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్ గారి సూచనల మేరకు , గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో మొట్టమొదటిసారిగా వినూత్నంగా 20 మంది క్రాఫ్ట్ టీచర్స్ మరియు 10 మంది గిరిజన ఆర్టిజన్స్ మొత్తం 30 మందికి గిరిజన సంప్రదాయక కళల పైన ఫ్యాబ్రిక్ బ్లాక్ ప్రింటింగ్ అనే అంశంపై ఐదు రోజుల రెసిడెన్షియల్ శిక్షణ కార్యక్రమాన్ని, హైదరాబాదులో తేదీ 26 ఫిబ్రవరి నుండి 2 మార్చ్ వరకు నిర్వహిస్తున్నారు. శిక్షణలో పాల్గొన్న అభ్యర్థులు ఐటిడిఏ ఉట్నూర్, ఎటునాగారం, భద్రాచలం, ప్లెయిన్ ఏరియా నుండి సంబంధిత ఐటిడిఏ అధికారుల ద్వారా నామినేట్ చేయబడి రావడం జరిగింది. వీరందరికీ భోజనం, వసతి, రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అదేవిధంగా పదిమంది గిరిజన ఆర్టిజన్స్ కు ప్రతిరోజు వెయ్యి రూపాయల చొప్పున ఆనరోరియం కూడా ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో టిఆర్ఐ సంచాలకులు డాక్టర్ వి సముజ్వల గారు, టి ఆర్ ఐ సంగ్రహాలయ సంరక్షకులు డాక్టర్ డి సత్యనారాయణ గారు, శిక్షణనిస్తున్న రాఎుప్రా డైరెక్టర్ డా. సునీతా ప్రసాద్ బృందం, ట్రైనింగ్ కోఆర్డినేటర్ శ్రీమతి అజ్మీరా శైలజ మరియు టిఆర్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ను కలిసిన రైల్వే మెగా సాధన కమిటీ.



**సికింద్రాబాద్ ఫిబ్రవరి26( సమయం న్యూస్) :** సికింద్రాబాద్ రైల్ నిలయంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ శ్రీనివాస్ మల్లాడి గారిని మహబూబాబాద్ రైల్వే మెగా ఫ్రెయిట్ మైంటెనెయన్స్ డిపో సాధన కమిటి బాధ్యులు కలిసి మహబూబాబాద్ లోనే డిపో ఏర్పాటు చేయాలనీలి కోరగా చాలా సానుకూలంగా స్పందించి రైల్వే బోర్డు ఆమోదనికి పంపనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మెగా డిపో ఏర్పాటుకు సంబంధించి ఉచితంగానే స్థలం ఇస్తున్నట్లు ప్రతిపాదనలు అందయని అన్నారు. మహబూబాబాద్ లో అధికంగా గిరిజన జనాభా కలిగి , ఎటువంటి ఉపాధి లేని య-ువత,నిరుద్యోగుల సంఖ్య కూడా ఎక్కువగా ఉందని జనరల్ మేనేజర్ గారికి సాధన కమిటీ బాధ్యులు వివరించడం జరిగినది మహబూబాబాద్ మాజీ పార్లమెంట్ సభ్యులు ప్రొఫెసర్ అజ్మీరా సీతారామ్ నాయక్ ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ గారితో సాధన కమిటి కలవడం జరిగినదిఈ కార్యక్రమం లో డిపో సాధన కమిటీ బాధ్యులు డాక్టర్ డోలి సత్యనారాయణ, మైస శ్రీనివాసులు, దీజ్రీ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు, దీ=హా నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్, రజక సంఘం నాయకులు దుగ్గి గోపాల్, ఫూజీూజ నాయకులు బుర్ర గోవర్ధన్ లు పాల్గొన్నారు.




# ఇష్టపడి చదవండి - లక్ష్యాన్ని సాధించండి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక మోటివేషన్ తరగతుల ప్రారంభం

**పటాన్ చెరు, ఫిబ్రవరి 26 (సమయం న్యూస్):** ప్రతి విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. గురువారం పటాన్ చెరు పట్టణంలోని జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వ్యక్తిత్వ వికాస ప్రేరణ తరగతులను ఆయన ప్రారంభించారు. పటాన్ చెరు, జేపీ కాలనీ డివిజన్లతో పాటు ఇస్నాపూర్, ఇంద్రేశం మున్సిపాలిటీలు మరియు పటాన్ చెరు మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 3,000 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మొత్తం 8 వేల మంది విద్యార్థులకు తన సొంత నిధులతో ప్రత్యేక మోటివేషన్ క్లాసులు నిర్వహించడంతో పాటు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పరీక్షల సమయంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని అధిగమించేందుకు ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు చంద్రయ్య ద్వారా ప్రత్యేక అవగాహన తరగతులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులను మొబైల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉంచాలని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే తన సొంత నిధులతో కొనుగోలు చేసిన పరీక్షా మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వరరావు నాయక్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల హెడ్‌మాస్టర్లు, కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా "చాహత్ బాజ్‌పాయ్" నియామకం

## తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 45మంది ఐఏఎస్ ల బదిలీలు



రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా బదిలీ ఉత్తర్వుల మేరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ గా పనిచేస్తున్న చాహత్ బాజ్‌పాయ్‌ను హనుమకొండ జిల్లా కలెక్టర్ గా నియమించింది. ప్రస్తుతం ఆమె గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న స్నేహా శబరీష్ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ గా బదిలీ కావడంతో ఆ స్థానంలో చాహత్ బాజ్‌పాయ్‌ను ప్రభుత్వం నియమించింది. అదేవిధంగా, హనుమకొండ జిల్లా కలెక్టర్ బాధ్యతలతో పాటు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కమిషనర్ పదవిని అదనపు బాధ్యతలుగా కొనసాగించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది..

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి సహకరించండి

**- పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి విజ్ఞప్తి**



**పటాన్ చెరు, ఫిబ్రవరి 26 (సమయం న్యూస్):**పటాన్ చెరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణానికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) నిధులు కేటాయించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) తోషిబా పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు. గురువారం ఉదయం ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని రుద్రారం ప్రాంతంలో ఉన్న తోషిబా పరిశ్రమ ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు పరిశ్రమల సహకారం ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇటీవల పటాన్ చెరు నియోజకవర్గానికి ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలను మంజూరు చేసిన విషయాన్ని గుర్తుచేసిన ఎమ్మెల్యే, అమీన్పూర్ పరిధిలోని సర్వే నంబర్ 993లో కళాశాల భవనం మరియు హాస్టల్ నిర్మాణాలకు ప్రభుత్వ అనుమతులు లభించాయని తెలిపారు. అయితే నిధుల కొరత కారణంగా నిర్మాణ పనులు ముందుకు సాగడం లేదని వెల్లడించారు. కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణానికి సుమారు రూ. 45 కోట్ల 70 లక్షలతో ప్రభుత్వ ఇంజనీరింగ్ అధికారులు అంచనాలు సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. భవిష్యత్తులో పారిశ్రామిక రంగానికి అవసరమైన నైపుణ్యంతో కూడిన ఇంజనీర్లను తయారు చేయడంలో పాలిటెక్నిక్ కళాశాల కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కళాశాల హాస్టల్ నిర్మాణంతో పాటు నియోజకవ ర్గంలోని గ్రామాలు, మున్సిపాలిటీలు, డివిజన్లలో పారిశుధ్య నిర్వహణకు అవసరమైన వాహనాల కొనుగోలుకు కూడా సీఎస్ఆర్ నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పరిశ్రమ యాజమాన్యాన్ని కోరారు. ఈ అంశాలపై పరిశ్రమ ప్రతినిధులు సానుకూలంగా స్పందిస్తూ, యాజమాన్యంతో చర్చించి త్వరలోనే సీఎస్ఆర్ నిధుల కేటాయింపుపై నిర్ణయం తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమ సీఎండీ హిరోషి ఫురుట, డైరెక్టర్ (మానవ వనరులు) కట్టుతోషి మారుమోతో, హెచ్ఆర్ అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఇక్కడే ఇల్లు కట్టిస్తాం గృహప్రవేశాలు కూడా చేయిస్తాం ఇది మా బాధ్యత

- **ధైర్యంగా ఉండండి ఐక్యమత్యంతో సాగండి**
- **వెలుగుమట్ల బాధితులకు కేటీఆర్ హామీ**




**ఖమ్మం , ఫిబ్రవరి 26 : ( సమయం న్యూస్ ):** ఇక్కడే మీకు ఇల్లు కట్టిస్తాం , ఇక్కడే మీ తో గృహప్రవేశాలు కూడా చేయిస్తాం , ఇది మా బాధ్యత ... ధైర్యంగా ఉండండి , ఐక్యమత్యంతో సాగండి , విడగొట్టడానికి ప్రయత్నిస్తారు , ఈ అంశంపై జిల్లా కలెక్టర్ తో , చీఫ్ సెక్రటరీ తో మాట్లాడటమే కాకుండా శాసనసభలో ఈ అంశాన్ని ప్రస్తావించడంతోపాటు సుప్రీంకోర్టు వరకు పోరాడుతామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రి కేటీఆర్ వెలుగుమట్ల భూదాన భూముల బాధితులకు హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలం సృష్టించడమే కాకుండా ఖమ్మం జిల్లాలో ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు మంత్రుల పై తీవ్ర విమర్శలు దారి తీసిన వెలుగుమట్ల భూదాన భూముల బాధితులకు గురువారం బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ , మాజీ మంత్రికేటీఆర్ పరామర్శించి ,వారితో మాట్లాడారు. కాగితాలు అన్ని ఉన్నాయి , భూదాన బోర్డు అంటే ప్రభుత్వమే ఈ స్థలాలు ఇచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఇంటి కోసం, కరెంటు కోసం కట్టిన డీడీలు , ఇంటి టాక్స్ తో సహా అన్ని కాగితాలు బాధితుల పక్షాన వారి వే ఈ స్థలాలు అన్నట్లుగా ఉన్నాయని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం పేరుతో ప్రభుత్వం పేదలకు అన్యాయం చేస్తుందని విమర్శించారు. అన్ని కాగితాలు ఉన్నప్పటికీ వారికి మెడబెట్టి గెంటటం దారుణమని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా రెండేళ్లలో విధ్వంసం తప్ప నిర్మాణం లేదని దుయబట్టారు. హైడ్రా పేరుతోపేదల భూములను సైతం కూల్చారని , గిరిజన రైతుల భూములను సైతం లాక్కున్నారని ఆరోపించారు. మహాత్మా గాంధీ స్ఫూర్తితో వినోబాభావే నిరుపేద వర్గాలకు సాగు కోసం , నివాసం కోసం భూదానం తలపెట్టారని , ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉండగాభూదాన బోర్డు కింద లక్ష ఎకరాల భూమి ఉండేదని తెలిపారు. ప్రస్తుతం వెలుగుమట్లకుసంబంధించి భూదాన బోర్డు కు 1950 లోనే 63 ఎకరాల విస్తీర్ణం గల భూమిని పేదలకు దానం చేశారని వివరించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు మోసగాళ్ల వలే వ్యవహరిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. వెలుగుమట్ల భూదాన బాధితుల కు పార్టీ అండగా ఉంటుందని ,ఇక్కడే ఇళ్లస్థలాలు ఇచ్చి ఇక్కడ గృహప్రవేశాలు చేయిస్తామని ఈ ముఖ్యమంత్రి కెసిఆర్హామీ ఇచ్చి ,ఈ విషయాన్నితెలియజేయా మన్నారని అన్నారు. ఇదిలా ఉండగా వెలుగుమట్ల భూదాన భూముల నుండి తొలగించబడి , నిరాశ్రయులుగా మారిన బాధితులకు బీఆర్ఎస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు రవిచంద్ర మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అజయ్ కుమార్ , ఎంపీ రవిచంద్ర , ఎమ్మెల్సీ , పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధు-సూదన్ , మాజీ ఎమ్మెల్యేలు చంద్రావతి , కాంతారావు , నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

**బాన్సువాడ ఫిబ్రవరి 26 (సమయం న్యూస్):**కామారెడ్డి జిల్లా బీర్కూరు మండలం తిమ్మాపూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానం లో శ్రీ లక్ష్మీ గోదా సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవనాథ రామానుజ జీయర్ స్వామి ఆధ్వర్యంలో జరిగిన శ్రీ దేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసన సభ్యుడు పోచారం శ్రీనివాస రెడ్డి తన సతీమణి పుష్పతో కలిసి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. పోచారం శంభు రెడ్డి -- ప్రేమ, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి -- సోని రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు హాజరయ్యారు. స్వామివారి కళ్యాణానికి ముందుగా నిర్వహించిన హోమంలో సతీసమేతంగా పూజలు నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో హనుమద్వాహనంపై స్వామివారిని ఊరేగించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, భారీ ఎత్తున భక్తులు ఈ కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ విడి బీఆర్ఎస్ పార్టీలో చేరికలు

- **కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే**



**తాండూరు మండలం, ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** తాండూరు మండలం పర్వతాపూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ పార్టీకి గుడ్ బై చెప్పి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సమక్షంలో వీరంతా గులాబీ కండువా కప్పుకున్నారు. పర్వతాపూర్ గ్రామానికి చెందిన ముఖ్య నాయకుడు మధుసూదన్ రెడ్డితో పాటు ఆయన అనుచరులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి పైలెట్ రోహిత్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. గ్రామంలో పార్టీ బలోపేతానికి కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రోహిత్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "కాంగ్రెస్ పార్టీ అనేది ఒక మునిగిపోయే నావ, ఆ పార్టీలో భవిష్యత్తు లేదన్నారు.



# భూదాన్ నిర్వాసితులకు కమ్యూనిస్టుల భరోసా

- **బాధితులకు పరామర్శ కలెక్టర్ కు వినతి**

**ఖమ్మం ఫిబ్రవరి 26 : ( సమయం న్యూస్ ) :** బోధన్ భూముల నిర్వాసితులకు కమ్యూనిస్టులు భరోసా ప్రకటించారు. బాధితులను పరామర్శించి , బాధితుల సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. జిల్లా వెలుగు మట్ల భూదాన భూముల్లో జర్గిన విషాదకర ఘటనను ఖండిస్తూ గురువారం జిల్లాకు చెందిన కమ్యునిస్టు పార్టీ నాయకులు స్థానిక అంబేద్కర్ భవన్ కు వెళ్ళి , భూనిర్వాసిత బాధితులను పరామర్శించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ( యం ) రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్ రావ్, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సిపిఐ యం మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేని వెంకటేశ్వర్లు, మధు బాధితులను పరామర్శించి అండగా వుంటామని తెలిపారు. నిర్వాసితులకు తిరిగి ఇండ్లను నిర్మించి ఇవ్వాలని, వారికి నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసారు. అందుకు సానుకూలంగా స్పందిస్తూ కలెక్టర్ తగు న్యాయం చేస్తామని హామి ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆ తర్వాత బాధితుల కూల్చిన ఇండ్ల నష్టాన్ని అంచనా వేశారు . ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు వై. విక్రమ్, సింగు నరసింహారావు, మాచర్ల భారతి, పొన్నం వెంకటేశ్వరరావు, ఎర్రా శ్రీనువాసరావు ,మెరుగు సత్యనారాయణ, దొంగల తిరుపతిరావు నందిపాటి మనోహర్, భూక్య శ్రీనివాసరావు, ఎస్. నవీన్ రెడ్డి, పిన్నింటి రమ్య, బోడపట్ల సుదర్శన్ నాగుల్ మీరా, బత్తిని ఉపేందర్,రామయ్య, సాంబశివ రెడ్డి పాల్గొన్నారు

# అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సహాయం

- **సీఎం సహాయ నిధి నుండి 3 లక్షల రూపాయలు అందజేత**


VEMULA SRINIVASULU, LLM., MBA.,
O.S.D. TO CHIEF MINISTER
GOVERNMENT OF TELANGANA

CHIEF MINISTER'S OFFICE



**చేవెళ్ల ఫిబ్రవరి 26 ( సమయం న్యూస్) :** నవపేట్ మండలం మాదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన దగ్గుల నారాయణ గౌడ్ అనారోగ్యంతో బాధపడుతూ శస్త్ర చికిత్సకు వైద్య సహాయం కోసం చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేనా భీమ్ భరత్ గారిని సంప్రదించగా వారు రాష్ట్ర శాసనసభాపతి శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద 3 లక్షల రూపాయల ప్రపోజల్ ఎల్ వో సి మంజూరు చేశారు. సంబంధిత ప్రపోజల్ ఎల్ఓసిని గురువారం భీమ్ భరత్ తన నివాసంలో వారికి అందజేశారు .మంచి వైద్యం అంది త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# పరిగి మండల నూతన ఇంచార్జ్ ఎంఈఓగా ఎం. అంజయ్య బాధ్యతలు స్వీకారం



**పరిగి( మం)ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** పరిగి మండల నూతన ఇంచార్జ్ మండల విద్యాధికారిగా ఎం. అంజయ్య నియమితులయ్యారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నస్కల్ లో గెజిటెడ్ హెడ్మాస్టర్గా విధులు నిర్వహిస్తున్న ఆయనకు విద్యాశాఖ అదనపు ఇంచార్జ్ ఎంఈఓ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం పరిగి మండల విద్యా వనరుల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎం. అంజయ్య మండల విద్యాధికారిగా అదనపు బాధ్యతలను స్వీకరించి అధికారికంగా జాయిన్ అయ్యారు. కార్యక్రమంలో మండల విద్యా వనరుల కేంద్ర సిబ్బంది మోహన్, శ్రీశైలం, చంద్రశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# మాదారం జెడ్పీహెచ్ఎస్ను సందర్శించిన జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

**- ఊట్ల పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం**



**పటాన్ చేరు,జిన్నారం, ఫిబ్రవరి 26 (సమయం న్యూస్):**సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలోని మాదారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో బోధన విధానాలు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలు, పాఠశాల పరిశుభ్రత తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. తరగతి గదులను సందర్శించిన జిల్లా విద్యాధికారి విద్యార్థులతో ముచ్చటించి వారి విద్యా స్థాయిని తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు పాఠ్యాంశాలను సమర్థవంతంగా బోధిస్తూ విద్యార్థుల ఫలితాలు మెరుగుపడేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయా అనే విషయాన్ని కూడా సమీక్షించారు. పాఠశాల ఆవరణలో పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించిన ఆయన, అవసరమైన మౌలిక వసతులపై ప్రధానోపాధ్యాయునికి పలు సూచనలు చేశారు. అనంతరం జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని కేజీబీవీ, ఊట్ల ప్రాథమిక పాఠశాలను సందర్శించి, ఉట్ల పాఠశాలలో హెటిరో సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు కవిత, జిల్లా విజిటింగ్ టీం సభ్యులు రామకృష్ణ రెడ్డి, జ్యోతి, ఊట్ల ప్రధానోపాధ్యాయులు అమరేశ్వరి, ప్రదీప్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పీఎం కిసాన్ లబ్ధిదారులకు రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

**- గుమ్మడిదల వ్యవసాయ అధికారి శ్రీనివాస్**



**పటాన్ చేరు(జిన్నారం), ఫిబ్రవరి 26 (సమయం న్యూస్):** గుమ్మడిదల మండల పరిధిలో పీఎం కిసాన్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులందరూ తప్పనిసరిగా రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గురువారం సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న నూతన విధానాల ప్రకారం రైతు రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన వారికి మాత్రమే పీఎం కిసాన్ ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోకుండా ఉంటే భవిష్యత్తులో పథకం లబ్ధి పొందే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు ఆలస్యం చేయకుండా సమీపంలోని వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించి వెంటనే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు. రైతులు అవసరమైన ఆధార్ కార్డు, భూమి పత్రాలు, ఆధార్ కార్డుకు లింక్ ఉన్న మొబైల్ తో వ్యవసాయ కార్యాలయానికి రావాలని అధికారులు సూచించారు. ప్రభుత్వ పథకాల లబ్ధి నిరంతరంగా అందుకోవాలంటే రైతు రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పూర్తి చేయాలని మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# సమస్యల పరిష్కారం కోసం విద్యుత్ అధికారుల ప్రజా బాట



**పటాన్ చెరు, ఫిబ్రవరి 26 (సమయం న్యూస్):** గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి గ్రామంలో పటాన్చెరు డివిజన్ విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా బాట కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ ఇంజనీరింగ్ అధికారి భాస్కరరావు రైతులు, గ్రామ ప్రజలతో సమావేశమై వారి సమస్యలను తెలుసుకుని పొలాల్లో స్వయంగా పర్యటించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని బొంతపల్లి, గుమ్మడిదల సబ్స్టేషన్లలో అధిక లోడ్ సమస్యలు నివారించేందుకు రూ. 4 కోట్లతో 8 ఎంవీఏ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే కానుకుంట పరిధిలో రూ. 15 లక్షల వ్యయంతో విద్యుత్ సమస్యలను పరిష్కరించినట్లు వెల్లడించారు. గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే అధికారులకు తెలియజేస్తే వెంటనే పరిష్కారం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడిదల ఏడీఈ దుర్గాప్రసాద్, బొంతపల్లి ఏఈ రవీందర్, గ్రామస్తులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

# పేదోడి సొంతింటి కల నెరవేరింది ఇందిరమ్మ ఇల్లు ప్రారంభం



**చేవెళ్ల ఫిబ్రవరి 26 ( సమయం న్యూస్) :** షాబాద్ మండలం లక్ష్మణరావు గూడ గ్రామంలో సుభాన్ రెడ్డి, మేకల మల్లేష్ గార్లకు ప్రభుత్వం తరపున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావడంతో వారు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి, ఆయన మాట్లాడుతూ పేదోడి సొంటింటి కల నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు సహకారం చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, లక్ష్మారావు కూడా సర్పంచ్ కుమార్, ప్రభాకర్ రెడ్డి, రవీందర్ నాయక్, మల్లారెడ్డి, అనంతరెడ్డి, ఆంజనేయులు ,సుభాష్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి ,జోగు అశోక్ కుమార్, శ్రీనివాస్ రఫిక్ మహేష్ ,శేఖర్ గౌరీశ్వర్ ,రాఘవేందర్ ,దయాకర్ ,మహేందర్ రెడ్డి, చెన్నారెడ్డి ,పెంటా రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నూతన శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బాలాలయానికి ముఖ్యఅతిథి హాజరైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్,ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి దేవాలయం నూతన బాలాలయ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో పాల్గొన్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి,ఈ కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ 2 వార్డు కౌన్సిలర్ ఆర్ వాణిశ్రీ మధుసూదన్ యాదవ్ ,కొడంగల్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు,ఆర్ రాహుల్ యాదవ్,శేఖర్ ,మాఫి వెంకటయ్య హోటల్ చిన్నయ్య,రమేష్ బాలరాజ్,అశోక్, రాజశేఖర్,, మరియు బొంరస్ పేట,,మండల మాజీ అధ్యక్షులు కోట్ల యాదగిరి, మాజీ వైస్ ఎంపీపీ శేరి నారాయణ రెడ్డి, సమన్వయ కమిటీ మాజీ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, ఎనికేపల్లి మాజీ ఉప సర్పంచ్ రవీందర్ గౌడ్, వి రవీంద్ర చారీ,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

# పర్సాపూర్ రైతువేదికలో నూనె గింజల పంటల సాగు పై అవగాహన

● టిఆర్ వి కె కోఆర్డినేటర్ డాక్టర్. రాజేశ్వర్,ఏడిఏ కె.శంకర్ రాథోడ్



**కొడంగల్ మండలం, ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** కొడంగల్ మండలంలోని పర్సాపూర్ గ్రామములోని రైతు వేదిక లో నూనె గింజల పంటల సాగు గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టి ఆర్ వి కె కోఆర్డినేటర్ డాక్టర్.రాజేశ్వర్ రెడ్డి, రైతులకు నూనె గింజల పంటల ప్రాముఖ్యత సాగు పద్ధతులు, ఎరువుల యాజమాన్యం ,చీడ పీడల నివారణ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ సహాయ వ్యవసాయ సంచాలకులు కె. శంకర్ రాథోడ్, మండల వ్యవసాయ అధికారి ఎన్ శ్రీలత, ఎ ఈ ఓ లు, ఉప సర్పంచ్ , గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు

# బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా దీపా నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నిక

ఫ్లోర్ లీడర్ గా నిర్ధారిస్తూ నియామక పత్రాన్ని అందించిన మాజీ ఎమ్మెల్యే



**తాండూరు మున్సిపల్, ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** తాండూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓట్ల శాతం పెంచుకుంటూ 12 సీట్లు సాధించిందని ,5 స్థానాలలో కొద్ది ఓట్ల తేడాతో ఓటమి చెందినట్లు చెప్పారు.పాలక పక్షానికి గట్టి పోటీ ఇచ్చి ధైర్యంగా ముందుకు సాగుతున్న కౌన్సిలర్లను మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బి ఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ గా దీపా నర్సింలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు చెప్పారు. ఈ మేరకు ఆమెను ఫ్లోర్ లీడర్ గా నిర్ధారిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. కౌన్సిలర్లు అందరూ ఏకతాటిపై ఉండి ప్రజా సమస్యలపై స్పందించి పాలకపక్షంతో ప్రజల పక్షాన పోరాటం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో బి ఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పల్లెల్లో మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**బషీరాబాద్,మండలం, ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో దాదాపు రూ.92 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామంలో రూ.11.20 లక్షలతో ప్రహరీ గోడ, రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు మరియు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే మహిళా సమైక్య భవనంకు శంకుస్థాపన చేసిన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డిఇస్మాయిల్ పూర్ గ్రామంలో (ఏకాంబరి దేవాలయం) రూ. 20 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు మరియు రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే మహిళా సమైక్య భవనంకు శంకుస్థాపన..ఎక్మాయ్ గ్రామంలో రూ.10 లక్షలతో నూతనంగా నిర్మించే సీసీ రోడ్డు పనులకు, రూ.10 లక్షలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్(ఐవీఖీ) మరియు రూ.10.15 లక్షలతో ప్రభుత్వ పాఠశాల ప్రహారి గోడ నిర్మాణానికి శంకుస్థాపనఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరులు బుయ్యని సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్ లు సీమా సుల్తాన ఖలీద్, పుప్పలి శశికళ మధుసూదన్, నామ్య నాయక్, వెంకటేష్ మహారాజ్, ఏఎంసీ చైర్మన్ మాధవ్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు అజయ్ ప్రసాద్, రాకేష్ మహారాజ్, సుధాకర్ రెడ్డి, వెంకట్రాం రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రాము నాయక్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సతీష్, వివిధ గ్రామాల నాయకులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# లోక్ అదాలత్ లో ప్రత్యామ్నాయ వివాద పరిష్కార మార్గం.

- సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్:
- రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగం
- వింధ్య నాయక్



**నారాయణపేట, ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చ్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్ మార్చ్ 28 న జరుగనున్నది అన్నారు. సీనియర్ సివిల్ జడ్జి మరియు లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్ మాట్లాడు తూ.. రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించడానికి లోక్ అదాలత్ ఎంతో ఉపయోగపడుతుందని న్యాయమూర్తి తెలిపారు. తదుపరి నారాయణపేట జిల్లాలోని మొత్తం 14 పోలీస్ స్టేషన్ పరిధిలో పెండింగ్లో ఉన్న అనుసరించి 65 00 కేసులను టార్గెట్ ఇచ్చారు. తదుపరి డిస్పోసల్ కేసుల గురించి ఆరాదీశారు ఇచ్చిన టార్గెట్ ను కేసులని డిస్పోజల్ చేయట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిని ఈ లోక్ అదాలత్ లో త్వరగా క్లియర్ చేయాలని ఆదేశించారు. ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుంటే కేసులు త్వరగా పరిష్కారమై సత్వర న్యాయం అందుతుందని ప్రజలు ఈట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ తమ కేసులను రాజ మార్గం ద్వారా పరిష్కారం చేసుకోవాలి తెలిపారు.త్వరగా పెండింగ్లో ఉన్న కేసులని ఈ లోక్ అదాలత్ చర్యలు తీసుకొని కార్యక్రమం విజయవంతం చేయడానికి అన్ని టీములు సిద్ధంగా ఉండాలని ఈ లోక్ అదాలత్ ను కక్షిదారులు ఉపయోగించుకునేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు యధావిధిగా కొనసాగించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏజెండా లోని అంశాలను క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు సివిల్ కేసులు, సైబర్ క్రైమ్స్,కేసులను, చీ× ఆక్ట్ పెండింగ్ లో ఉన్నాయా చర్చించారు పెండింగ్లో ఉన్న ప్రతి ఒక్క కేసు ఈ లోక దాతలు డిస్పోసల్ చేయాలని పోలీస్ అధికారులకు ఆదేశించారు.ఎగ్జిక్యూషన్ పిటిషన్ (జూ), క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు సివిల్ కేసులు, సైబర్ క్రైమ్స్, చీ× ఆక్ట్ పెండింగ్ పెండింగ్ కేసులగురించి ఆరాదీశారు. తదుపరి ఎన్. బి.డబ్ల్యూ (చీదీఔ) కేసులు, చార్జ్ షీట్ దాకలు చేసారా పెండింగ్ లో ఉంటే త్వరగా ఎంక్వయిరీ చేసి ఎగ్జిక్యూట్ చేయమన్నారు.గౌరవనీయులైన తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అధికార సంస్థ, హైదరాబాద్ ఆదేశాలమేరకు ముందుగా పెండింగ్లో ఉన్న కేసులను పరిష్కరించాలని ఆదేశించారు. తదుపరి 15100 నెంబర్ టొల్లె ఫ్రీ నో చార్ట్ ని ఆవిష్కారించారు. జిల్లాలో ఉన్న ప్రతి పోలీస్ స్టేషన్లో అఃజేశారు నోటీసు బోర్డు లో ఉండాలని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తలు సీనియర్ సివిల్ జడ్జి మరియు లీగల్ సర్వీసెస్ కార్యదర్శి వింధ్య నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్, డి స్ పి లింగయ్య చీఫ్ లిగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్ కే లక్ష్మీపతి గౌడ్ మరియు పోలీస్ అధికారులు కోర్ట్ కష్టాల్స్ పాల్గొన్నారు.



# డీగ్రీ విద్యార్థులకు టాస్క్ ఓరియంటేషన్

- ముఖ్యఅతిథిగా పాల్గొన్న (ఐ. టి.ఇ. సి)మహబూబ్ నగర్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం.డి.సిరాజోద్దీన్
- కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ రఫియా ఖానం

**కొడంగల్ మున్సిపల్, ఫిబ్రవరి,26(సమయం న్యూస్) :** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం కళాశాల ఇంగ్లీష్ మరియు కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ సెంటర్ సౌజన్యంతో విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ (ఐ. టి. ఇ. సి) మహబూబ్ నగర్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఎం. డి. సిరాజుద్దీన్ హాజరై విద్యార్థులకు బేసిక్ మాథమేటిక్స్, పోటీ పరీక్షలకు అవసరమైన అప్టిట్యూడ్, మూర్తిమత్వ అభివృద్ధి, వృత్తిపరమైన అభివృద్ధి, టాలీ, కృత్రిమ మేధ వినియోగం, ఇంటర్వ్యూ స్కిల్స్, మెడికల్ కోడింగ్, స్కిల్ డెవలప్ మెంట్ సర్టిఫికెట్ కోర్సులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగ సాధనలో అకాడమిక్స్ పాత్ర 60 శాతం ఉంటే 40 శాతం నైపుణ్యాలే పాత్ర వహిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ రఫియా ఖానం, డా. ఆర్. శ్రీనివాస్,డా. కె. రమేష్ బాబు, టి. స్వరూప రాణి ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కుటుంబ క్షేమం కోసం మద్యం సేవించి వాహనం నడపొద్దు

● ట్రాఫిక్ ఏసిపి సత్యనారయణ

**హన్మకొండ ఫిబ్రవరి26( సమయం న్యూస్) :** వాహనదారులు తమ కుటుంబ క్షేమాన్ని దృష్టిలో వుంచుకోని మద్యం సేవించి వాహనం నడపొద్దని వరంగల్ ట్రాఫిక్ ఏసిపి వాహనదారులకు సూచించారు. ఆరైవ్ – ఆలైవ్ రెండవ విడత కార్యక్రమములో భాగంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టు పట్టుపడిన వాహనదారులకు వరంగల్ కమిషనరేట్ కార్యాలయములో ట్రాఫిక్ ట్రైనింగ్ కేంద్రంలో ట్రాఫిక్ పోలీసుల అధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసిపి మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబందనలు పాటించాల్సిన అవసరం ఎంతైన వుందని. రోడ్లపై జరిగే రోడ్డు ప్రమాదాలకు మీరు బాధ్యులు కావద్దని, వాహన నడిపే సమయంలో తమ స్వీరక్షణకై తప్పని సరిగా రోడ్డు నియమాలు పాటించాలని, ఇటీవల కాలం రాష్ట్రంలో హత్యల కన్న రోడ్డు ప్రమాదాలో మరణించిన వారి సంఖ్య అధికమని, ఈ ప్రమాదాలు అధికంగా మద్యం మత్తులో జరిగినవి పోలీసులు గుర్తించారని, మద్యం సేవించి వాహనం నడపటం కారణంగా మీతో పాటు రోడ్డుపై నడిచి వెళ్ళేవారు, ఇతర వాహనదారులు సైతం ప్రమాదాల బారిన పడి మరణిస్తున్నారని. రొడ్డు ప్రమాదాల్లో ఇంటి యజమాని మరణించడంతో ఆ కుటుంబం రోడ్డు పడుతున్నాయని. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాల కారణంగా ఎన్నో కుటుంబ దీనస్థితిలో తమ జీవితాలను కోనసాగిస్తూన్నాయని ఏసిపి తెలియజేసారు. హన్మకొండ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సీతారెడ్డి, ట్రైనింగ్ సెంటర్ ఎస్.ఐ నారయణ పాల్గోన్నారు.

# పెండింగ్ ఫైల్స్, ప్రజలకు దూరం అయిన పాలనే నిదర్శనం

మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ తీరుపై విమర్శల వీడ్కోలు...

మహబూబాబాద్ జిల్లా పరిపాలనలో ప్రస్తుతం పనిచేసి బదిలీపై వెళ్తున్న జిల్లా కలెక్టర్ వ్యవహార శైలి తీవ్ర చర్చకు దారి తీస్తూంది.



ప్రజల సమస్యల పరిష్కారం కన్నా ఫైళ్ల గుట్టలు పెరిగిపోయాయన్న విమర్శలు వినిపించగా, “పాలన అంటే ప్రజలతో కలిసే వ్యవస్థ” అనే భావన వద్ద కనిపించలేదని స్థానిక మేధావులు, జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఫైళ్ల పాలన... ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యం...** పెండింగ్ ఫైల్స్ పెరుగుతూ ఉండటం, కోర్టు కేసుల్లో జడ్జిల మందలింపులు ఎదుర్కోవాల్సి రావడం వంటి అంశాలు కలెక్టర్ అద్వైత్ పరిపాలనపై ప్రశ్నలు లేవనెత్తాయి. అధికారిక వ్యవస్థలో సమయపాలన లేకపోవడం వల్ల ప్రజలు కార్యాల యాల చుట్టూ తిరిగే పరిస్థితి ఏర్పడిందని విమర్శకులు చెబుతున్నారు. “తక్షణ నిర్ణయాలు తీసుకో వాల్సిన చోట ఆలస్యం జిల్లా పాలనను బలహీనపరిచింది” అన్న వ్యాఖ్యలు అప్పట్లో, ఇప్పట్లో వినిపించాయి.

**ప్రజలకు దూరమైన కలెక్టర్?...** మేధావులు, జర్నలిస్టులు, కింది స్థాయి ప్రజా ప్రతినిధులు, ప్రతిపక్ష నాయకులను పట్టించుకోరన్న ఆరోపణలు తీవ్రంగా వినిపించాయి. “ప్రజా వాణి” కార్యక్రమం పేరుకే నిర్వహించబడిందని, ప్రజల ఫిర్యాదులపై సరైన మానిటరింగ్ లేకపోయిందని స్థానిక వర్గాలు విమర్శించాయి. “అన్ని తానే అన్నట్లుగా వ్యవహరించడం వల్ల పరిపాలన ఆయన చేతిలోనే నిలిచిపోయింది” అనే అభిప్రాయం వ్యక్తమైంది.

**సమీక్షలు లేని సీజన్... దిశా నిర్దేశం లేని శాఖలు...** సీజన్ వైజ్ అధికారుల సమీక్షా సమావేశాలు లేకపోవడం వల్ల నీటి ప్రాజెక్టులు, రోడ్ సేఫ్టీ, భూసేకరణ వంటి కీలక అంశాల్లో స్పష్టత లేకుండా పోయిందని అధికారులు చెబుతున్నారు. ముఖ్యంగా భూసేకరణలో కలెక్టర్ గా ఆయన ప్రజల పక్షం నిలబడలేదన్న విమర్శలు గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా వినిపించాయి.

**“తు.. తు.. మంత్రంగా పాలన”,,** జిల్లా కలెక్టర్ అద్వైత్ పై ఎందరు విమర్శలు చేసిన పరిపాలనలో సమగ్ర దృష్టి లేకపోవడం వల్ల పనులు తాత్కాలికంగా సాగి ఆగిపోయే పరిస్థితి ఏర్పడిందని విమర్శకులు పేర్కొన్నారు. ప్రజా సమావేశాలు లేకుండా, ప్రజలతో మమేకం కాకుండా సాగిన విధానం జిల్లా అభివృద్ధి వేగాన్ని తగ్గించిందని స్థానిక వర్గాలు అభిప్రాయపడ్డాయి.

**సమతుల్యత లేని పరిస్థితి...** పరిపాలనలో ఉన్న ఒత్తిడులు, వ్యవస్థాపక పరిమితులు కొన్ని నిర్ణయాలపై ప్రభావం చూపి ఉండొచ్చని కొందరు అధికారులు సూచిస్తున్నారు. విమర్శలతో పాటు వాస్తవ పరిస్థితులను కూడా విశ్లేషించాల్సిన అవసరం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఏదైమైన ప్రజలతో జిల్లా కలెక్టర్లతో దూరం పెరిగితే అధికారం బలహీనమవుతుంది. సమీక్షలు, సమావేశాలు, సమన్వయం, ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్ లేకపోతే “కలెక్టర్ కార్యాలయం” కాగితాల గుట్టగా మారుతుంది. మహబూబాబాద్ జిల్లా పాలన అనుభవం అదే చెప్పిందని విశ్లేషకులు భావిస్తున్నారు.



# ఒక్క సినిమాతో ఇండస్ట్రీని షేక్ చేసిన 22 ఏళ్ల బ్యూటీ

సినిమా రంగంలో కొందరు నటీమణులు దశాబ్దాల కాలం వేచి చూసినా దక్కని గుర్తింపును, మరికొందరు తమ తొలి చిత్రంతోనే సొంతం చేసుకుంటారు. సరిగ్గా ఇదే రీతిలో బాలీవుడ్‌లో ఇప్పుడు ఒకే ఒక్క సినిమాతో స్టార్‌డమ్ దక్కించుకుని, అందరి దృష్టిని ఆకర్షిస్తోంది 22 ఏళ్ల యువ నటి అనీత్ పద్ద. కేవలం అందంతోనే కాకుండా తన అద్భుతమైన అభినయంతో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తూ సరికొత్త రికార్డులను సృష్టించింది. ప్రముఖ దర్శకుడు మోహిత్ సూరి దర్శకత్వంలో తెరకెక్కిన 'సయ్యారా' సినిమాతో అనీత్ వెండితెరకు పరిచయమైంది. జూలై 18న ఎటువంటి భారీ అంచనాలు లేకుండా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఊహించని విజయాన్ని నమోదు చేసింది. ఇప్పటివరకు ఈ సినిమా రూ. 570 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి, ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది. ఒక డెబ్యూ హీరోయిన్ సినిమా ఈ స్థాయిలో కలెక్షన్స్ సాధించడం బాలీవుడ్‌లో అరుదైన రికార్డుగా నిలిచింది. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో జన్మించిన అనీత్ పద్ద.. ప్రస్తుతం ఢిల్లీ విశ్వవిద్యాలయంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేస్తోంది. నటనపై ఉన్న మక్కువతో మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె, పలు వాణిజ్య ప్రకటనల్లో నటించి గుర్తింపు పొందింది. ఆ క్రమంలోనే 'సయ్యారా'లో కథానాయికగా అవకాశం దక్కించుకుంది. మొదటి సినిమాలోనే పరిణతి చెందిన నటనను కనబరచడంతో స్టార్ హీరోలు సైతం ఆమె నటనకు ఫిదా అయిపోయారు. ఈ సినిమా చూసిన పలువురు సినీ ప్రముఖులు, స్టార్ హీరోలు సోషల్ మీడియా వేదికగా అనీత్ నటనపై ప్రశంసలు కురిపించారు. యువతలో ఆమెకు విపరీతమైన క్రేజ్ పెరగడంతో, ప్రస్తుతం గూగుల్‌లో ఈ అమ్మడి గురించి తెలుసుకోవడానికి నెటిజన్లు తెగ ఆరా తీస్తున్నారు. తొలి ప్రయత్నంలోనే వందల కోట్ల క్లబ్‌లో చేరిన అనీత్ పద్ద, భవిష్యత్తులో బాలీవుడ్‌ను ఏలే స్టార్ హీరోయిన్ అవుతుందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



## వివాహ బంధంతో ఒక్కటైన విరోష్

హైదరాబాద్, ఫిబ్రవరి 26: నటులు విజయ్ దేవరకొండ, రష్మిక వివాహబంధంతో ఒక్కటైనట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం 10.10కి రష్మిక మెడలో విజయ్ మూడుముళ్లు వేసినట్లు సమాచారం. దీంతో ఈ జంటకు అభిమానులు శుభాకాంక్షలు తెలుపుతూ పోస్టులు పెడుతున్నారు. ఈ పెళ్లి వేడుక రెండు సంస్కృతులు, సంప్రదాయాల కలయికగా జరుగుతోంది. ఉదయం విజయ్ వైపు నుంచి హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం జరిగింది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా జరుగుతోన్న ఈ వివాహానికి ఇండస్ట్రీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ వివాహ సంబరాల్లో భాగంగా విజయ్ - రష్మిక 'విరోష్ ప్రీమియర్ లీగ్' పేరుతో సరదాగా ఓ చిన్న క్రికెట్ మ్యాచ్‌ను నిర్వహించినట్లు ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. అలాగే బుధవారం హల్దీ వేడుకను నిర్వహించినట్లు విరోష్ జోడీ తెలియజేసింది. ఇక వీరి వివాహ విందును మార్చి 4న హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు.

# ఒక్క హిట్టు పడలేదు

ఎవరు ఏ రంగాన్ని ఎంచుకున్నప్పటికీ, అందులో రాణించాలంటే ప్రతిభ ఉండాలి. టాలెంట్ ఒక్కటి ఉంటే సరిపోతుందా అంటే, కొంచెం అదృష్టం కూడా ఉండాలనుకోండి అనే సమాధానం వస్తుంది. అదృష్టం అనే విషయంలో ఎవరి అభిప్రాయాలు వాళ్లకి ఉంటాయి. కాకపోతే అదృష్టం అనే దాని గురించి అప్పుడప్పుడు నమ్మవలసి వస్తుంటుంది. అందుకు కారణాలు .. కళ్లముందు కనిపించేవే అని చెప్పాల్సి ఉంటుంది. ఆశించినస్థాయిలో గుర్తింపు రానప్పుడు .. విజయాలు అందనప్పుడు .. అదృష్టం లేదని చెప్పుకుంటూ ఉంటారు. అలాంటి అదృష్టాన్ని వెతికి పట్టుకునే పనిలో ఉంటారు. ప్రస్తుతం భాగ్యశ్రీ బోర్సే అదే పనిలో ఉందని అంటున్నారు. ఇప్పుడున్న కథానాయికలలో గ్లామరస్ బ్యూటీ ఎవరంటే కుర్రకారు ఠకీమని చెప్పే మాట భాగ్యశ్రీ బోర్సే. తుమ్మెదల్లాంటి కళ్లతో మనసులు దోచే ఈ సుందరికి ఇంతవరకూ హిట్టు పడలేదు. ఆమె అభిమానులు బెంగపెట్టుకోవడంలోని అసలు కారణం ఇదే. ఈ నేపథ్యంలో ఆమె అఖిల్ సరసన నాయికగా 'లెనిన్' సినిమా చేస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను, అన్నపూర్ణ - సితార సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'మే'లో ఈ సినిమాను విడుదల చేసే ఆలోచనలో ఉన్నారు. తమన్ సంగీతాన్ని సమకూర్చిన ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. భాగ్యశ్రీ గ్లామర్ ఈ సినిమాకి ప్రత్యేకమైన ఆకర్షణగా నిలుస్తుందని అంటున్నారు. ఈ సినిమాతోనైనా ఆమెకి అదృష్టం కలిసొస్తుందేమో చూడాలి మరి.





# అక్కడ.. ఇక్కడ కియారా సక్సెస్



సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్లుగా సక్సెస్ ట్రాక్ కొనసాగిస్తూ, వ్యక్తిగత జీవితాన్ని కూడా అంతే అందంగా బ్యాలెన్స్ చేసే వారు కొందరే ఉంటారు. ఆ జాబితాలో అగ్రస్థానంలో నిలుస్తుంది అందాల నటి కియారా అద్వానీ. తన నటనతో, గ్లామర్‌తో ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్న ఈ ముద్దుగుమ్మ, ప్రస్తుతం కెరీర్ పరంగానే కాకుండా పర్సనల్ లైఫ్‌లోనూ ఎంతో సంతోషంగా ఉంది. 1992, జూలై 31న ముంబైలో జన్మించిన కియారా అసలు పేరు అలియా అద్వానీ. తండ్రి జగదీప్ అద్వానీ వ్యాపారవేత్త కాగా, తల్లి జెనీవీవ్ జాఫ్రీ ఉపాధ్యాయురాలు. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ పూర్తి చేసిన కియారా.. 2014లో 'ఫగ్లీ' చిత్రంతో సినీ అరంగేట్రం చేసింది. ఆ తర్వాత 'ఎం.ఎస్ ధోనీ' బయోపిక్ ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. తెలుగులో మహేశ్ బాబుతో 'భరత్ అనే నేను', రామ్ చరణ్‌తో 'వినయ విధేయ రామ' మరియు త్వరలో విడుదల కానున్న 'గేమ్ ఛేంజర్' సినిమాలతో టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా ఎంతో దగ్గరైంది. కియారా తన సహనటుడు, బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాను ప్రేమ వివాహం చేసుకుంది. 'షేర్షా' సినిమా షూటింగ్ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమ చిగురించింది. కొన్నేళ్ల పాటు డేటింగ్‌లో ఉన్న ఈ జంట గతేడాది రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో అట్టహాసంగా పెళ్లి చేసుకున్నారు. తాజాగా ఈ జంటకు కుమార్తె జన్మించడంతో కియారా జీవితం మరింత పరిపూర్ణమైంది. ప్రస్తుతం ఈ దంపతులు ముంబైలోని బాంద్రాలో గల తమ లగ్జరీ నివాసంలో ఫ్యామిలీ లైఫ్‌ను ఎంజాయ్ చేస్తున్నారు. ఒకవైపు తల్లిగా బాధ్యతలు నిర్వహిస్తూనే, మరోవైపు సినిమాల్లోనూ బిజీగా ఉంది కియారా. ప్రస్తుతం ఆమె చేతిలో 'డాన్ 3', 'టాక్సిక్' వంటి భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. తన వ్యక్తిగత విషయాలను, ఫోటోలను నిత్యం సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకుంటూ, మోడ్రన్ ఉమెన్‌గా అందరికీ స్ఫూర్తినిస్తోంది.

# ది కేరళ స్టోరీ విడుదలకు బ్రేక్

## సెన్సార్ బోర్డును తప్పుపట్టిన హైకోర్టు

**తిరువనంతపురం, ఫిబ్రవరి 26:** సరిగ్గా విడుదలకు ఒక్కరోజు ముందు 'ది కేరళ స్టోరీ2' మూవీకి న్యాయపరంగా ఎదురుదెబ్బ తగిలింది. సినిమా ప్రచార చిత్రంలో కేరళను తప్పుగా చూపించారని, మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయని సామాజిక మాధ్యమాల వేదికగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సినిమా విడుదలపై స్టే విధించాలని, సెన్సార్ సర్టిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై గురువారం రాష్ట్ర హైకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) తీరును హైకోర్టు తప్పుపట్టింది. సినిమా పునః పరిశీలించాల్సిందిగా జస్టిస్ కురియన్ థామస్ సీబీఎఫ్‌సీకి సూచించారు. అప్పటివరకూ సినిమా విడుదలపై స్టే విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా ఈ సినిమా రూపొందింది. దీనికి కామాఖ్యా నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించగా విపుల్ అమృత్‌లాల్ షా నిర్మించారు. ఉల్కా గుప్తా, అదితి భాటియా, ఐశ్వర్య ఓజా నటించారు. ప్రేమ మాయలో పడి కొందరు అమ్మాయిలు.. కన్నవాళ్లను ఎదురించి తమ ప్రియుడితోనే జీవితం అనుకుని దూరమవుతుంటారు. కానీ రోజులు గడుస్తున్నకొద్దీ ఆ ప్రేమే ఓ పెద్ద మోసమని తెలుసుకున్నాక దిక్కుతోచని పరిస్థితుల మధ్య ఎవరికీ చెప్పుకోలేని హింసని భరిస్తుంటారు. అలాంటి నిజజీవిత కథాంశంతో 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్' రూపొందింది. ఫిబ్రవరి 27న ఈ మూవీని విడుదల చేస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కేరళ హైకోర్టు ఉత్తర్వులతో ప్రస్తుతం వాయిదా పడింది.




Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131